
Making of a Leader

నాయకులు ఎట్లా అవుతారో?

రాజకీయాల్లో....



డా. నాగులపల్లి భాస్కరరావు

జీవితచరిత్రల గ్రంథాలయం

ముదునూరు, కృష్ణాజిల్లా

పుస్తకం గురించి

నాయకులుగా చెలామణి అవుతున్న వాళ్ళు రాజకీయాల్లో ఈ రోజుల్లో కో కొల్లలు. అయితే కొద్దిమంది మాత్రమే నాయకులుగా మిగిలిపోతారు. వచ్చేతరానికి కూడా అధికారంతో నిమిత్తం లేకుండా పిలవబడతారు. తరాలుగా వాళ్ళు ఎట్లా అవకాశాలను వినియోగించుకొని నాయకులుగా తీర్చిదిద్దుకుంటారు. అందరిలాగానే మొదలై ఎన్నో అవరోధాలను ఎదుర్కొని ఎన్నో ఆలోచనలు చేసి ముందు చూపుతో భవిష్యత్ బాటల గూర్చి ఆలోచిస్తారు. అది అంతా ఎట్లా, ఎప్పుడు మొదలవుతుందో అనే విషయం గురించే ఈ పుస్తకం. నారా చంద్రబాబు నాయుడు ఏ విధమైన కృషితో నాయకుడుగా ఎట్లా తన్ను తాను మల్చుకున్నాడు అనేదే. క్లుప్తంగా నాకు స్వయంగా తెలిసిన విషయాల ఆధారంగా వ్రాసింది.

Making of a Leader

"నాయకులు ఎట్లా అవుతారో? రాజకీయాల్లో" అనే ఈ పుస్తకాన్ని వినటానికి పక్కన కనబడుతున్న ఈ QR code ను మీ ఫోన్ లో Google lens సహాయంతో download చేసుకొని వీనుల విందుగా వినవచ్చు.

సమయం : 2 గంటల 12 ని॥

Making of a Leader

Nayakulu etla autaro ?

Dr Nagulapalli Bhaskara Rao

Copies : 1000

For copies:

Dr Nagulapalli Bhaskara Rao,

Mudunuru.

Krishna Dist–521 201

Wikipedia, Mydukaan

ISBN. 978–93–340–0401–5

ముద్రణ:

శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ

Srisri Printers.vja@gmail.com

Ph: 94906 34849


Rs: 100/-

Audio : V.Chennakesav

Editing : Sk. Naziya, Kamali sisters

అంకితం

ఒక ఆదర్శనాయకుడికి



కీ.శే. కాకాని వెంకటరత్నంగారు

నాయకుడిగా 20 సంవత్సరాలలో

ఆయన చేసిన సేవను, అభివృద్ధిని, చైతన్యాన్ని

చనిపోయిన 50 సంవత్సరాల తర్వాత కూడా

గుర్తు చేసుకుంటూనే వున్నాం...

నన్ను ప్రభావితం చేసిన నాయకుడు కూడా.

మండపేట నుంచి ముందుమాట

ప్రజల మనిషేగదా నాయకుడు

–సిద్ధార్థబక్ష్, డా. విజయబక్ష్

డాక్టర్ నాగులపల్లి భాస్కరరావుగారు దేశ రాజకీయాలను నిశితంగా పరిశీలించిన అనుభవమే కాక, గత 60 సంవత్సరాలుగా ఢిల్లీ వేదికగా ఎన్నో సంస్థలతో, ఎందరో వ్యక్తులతో పనిచేసిన పరిచయం వున్న వ్యక్తి. ఆయన అపార అనుభవంలో ఎంతో మంది రాజకీయ నాయకుల బలాలు, బలహీనతలు ఆయనకు తెలిసుండడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఆయన వివిధ విషయాల మీద ఇప్పటికే చాలా పుస్తకాలు వెలువరించారు.

ఒక తెలుగువాడిగా, తెలుగు ప్రజల పట్ల, తెలుగు(ఆంధ్ర) దేశం పట్ల, తెలుగువారి పరిస్థితుల పట్ల మమకారంతో ఒక తెలుగు నాయకుని గూర్చి తెలుగులో ఈ పుస్తకం రాశారు. ఇట్లా ఎందుకనవలసి వచ్చిందంటే ఆయన ఆంగ్లంలో చాలా రాశారు కాబట్టి. ఎందరెందరో రాజకీయాల్లోకి వస్తుంటారు, పోతుంటారు. కనీసం కొందరి పేర్లయినా మనకు గుర్తుండవు. అయితే కొందరు అధికారంలో వున్నా, లేకున్నా తమదైన 'ముద్ర' ప్రజల మీద వేస్తారు. వారినే నిజమైన నాయకులు (Leaders) గా పరిగణిస్తాము... అటువంటి ప్రస్తావనే ఈ పుస్తకంలో భాస్కరరావుగారు నారా చంద్రబాబు నాయుడు గార్ని గురించి చేశారు.

తన పరిధిలో, తన పరిశీలనలో, తన అనుభవంలో, తన భాగస్వామ్యంలో తన సూచనలో జరిగిన కొన్ని కొన్ని సంఘటనలను పేర్కొంటూ, చంద్రబాబుగారి

వ్యక్తిత్వాన్ని అంచనా వేశారు. అట్లా చెప్పటంలో ఆయన నిర్మొహమాటంగా వ్యవహరించారని చెప్పొచ్చు.

భాస్కరరావుగారికి CBN తో 1978 నుంచి పరిచయం. అంటే బాబుగారు కాంగ్రెస్ పార్టీలో వున్నప్పటి నుండీ ఇప్పటివరకు అంత సుదీర్ఘ పరిచయంలో బాబుగారి ఉత్థానపతనాలన్నీ ఆయన ఎరిగున్నవే. వాటిని తన దృష్టిలో పెట్టుకొని ఆంధ్రదేశాధినేతగా, పాలకుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ఒక వ్యక్తిగా, ఢిల్లీస్థాయి రాజకీయాల్లో ప్రముఖుడిగా బాబుగారేమిటన్నది తాను విన్న, కన్నవాటి ఆధారంగా చెప్పుకొంటూ వచ్చారు.

విషయసూచిక

క్లుప్తంగా

ఈ పుస్తకం ఎవరి జీవిత చరిత్రకాదు. ఏ రాజకీయ నాయకుడి చరిత్ర కూడా కాదు. పార్టీ రాజకీయాల్లో గ్రామాల నుంచి చదువుకున్న ఒక సాధారణ యువకుడు ఎన్నికల రంగంలో దిగి తనను తాను ఏ విధంగా నాయకుడిగా అతి కొద్ది కాలంలోనే తీర్చి దిద్దుకున్నాడో తెలియచెప్పే ప్రయత్నం మాత్రమే. అది కూడా దూరాన్నుంచి నాకు తెలిసిన సంఘటనలకు పరిమితమై ఏ విధంగా ఎదిగాడో చెప్పటమే. అయినా ఇది ఆ నాయకుడి సమగ్ర వివరం అసలే కాదు. నాయకుడు అవటానికి చేసిన కృషి చెప్పటంవల్ల ఇంకా ఎంతో మంది చదువుకున్న యువకులు రాజకీయాల్లో అవకాశాలకు ఎట్లా ప్రయత్నించవచ్చో చెప్పకనే చెప్పే ప్రయత్నం ఇది. నా 60 సంవత్సరాల అనుభవంలో ఎంతో మంది ఎన్నో రాష్ట్రాల నుంచే కాక ఆంధ్రప్రదేశ్ నుంచి 1950 ప్రాంతం నుంచి కూడా గమనించటం జరిగింది. పరిశీలించి, సంబంధించిన పుస్తకాలు కూడా వ్రాశాను. నా మొదటి పుస్తకం 1966లో ఇంగ్లీషులో "The Politics of Leadership in an Indian State". ఇప్పుడు ఈ పుస్తకం బహుశా నా చివరి పుస్తకం అవుతుందనుకుంటా. ఇది రాజకీయాల్లోకి కొత్తరక్తం, కొత్తతరం రాలేకపోతున్నారే అని నా నిరుత్సాహాన్ని తెలియజేసే చిన్న ప్రయత్నం కూడా. ముఖ్యంగా ఎందుకు ఓట్ల రాజకీయాలకే పరిమితమై భవిష్యత్‌ను, భావితరాల గురించి పట్టించుకోవటం లేదనే, అవకాశాలు గ్రహించటం లేదనే నిరుత్సాహం కూడా, అంతే. ఇందుకు చంద్రబాబు ఒక ఉదాహరణ అని తెలియజెప్పే ప్రయత్నం. యువతరం గ్రహించాల్సిన విషయం, మనస్సు ఉంటే ఊబిలోంచి బయట పడలేమా అని చెప్పే ప్రయత్నం కూడా.

క్రమశిక్షణ రాజకీయాల్లో 205 ఎంతో ముఖ్యమనే విషయ చంద్రబాబు ఎన్నో విధాలుగా తెలియజేశారు. అదే ఆయన ఎన్టిఆర్ గారి దగ్గర నేర్చుకున్న ఎంతో విలువైన విషయం.

అలాగే బ్రహ్మకుమారీల వాళ్ల ద్వారా ధ్యానం పద్ధతులు తెలుసుకుని ఎంతో నిష్టతో ఎన్నో సంవత్సరాలుగా చేసి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదనే విషయం కూడా ఆయన కార్యదీక్షకు, దక్షతకు ఒక కారణం.



పీఠిక

1966 లో నేను Politics of Leadership in an Indian State – Andhra Pradesh అని ఒక పుస్తకం ఇంగ్లీషులో వ్రాశా. భారతదేశపు ఒక రాష్ట్రంలో నాయకత్వ రాజకీయాలు– ఆంధ్రప్రదేశ్) అది అప్పటి కొన్ని తెలుగు జిల్లాలలో జిల్లా పరిషత్ కి నాయకులు, ఏ విధంగా ఎన్నికై అభివృద్ధికి తోడ్పడ్డారో గుర్తు చేశా. జలగం వెంగళరావు, సాగి సూర్యనారాయణ రాజు, కాకాని వెంకట రత్నం, విజయభాస్కరరెడ్డిలాంటి వాళ్ళు నాయకులుగా ఎట్లా ఎదిగారో, ప్రజలని ఎట్లా చైతన్యపరచి అభివృద్ధికి బాటలు వేశారో వివరించా. దశాబ్దం తర్వాత '**నాయకులం**' అని చెప్పుకునే వాళ్ళు, పిలవబడేవాళ్ళు కోకొల్లలుగా వచ్చారంటే అతిశయోక్తికాదు. ఈ మధ్య వచ్చిన ఎన్నో సినిమాల్లో ఎక్కువగా ఒక మాఫియా, గ్రూప్ కీ,, గ్యాంగ్ కీ "Leader" గా మొదలై గూడుపుఠానీలతో రాజకీయ అధికారం దక్కించుకుని "**నాయకుడు**" అవ్వటం చూశాం. మరి ఇప్పుడు లీడర్ అంటే పార్టీలో ఎన్నికైన "అధిపతా!", రాజకీయ పార్టీలకతీతంగా, అధికారానికి అతీతంగా, సమస్యలతో సతమతమై నిలచిన వ్యక్తులా? మెజారిటీ ఓట్లు ఏదో ఒక రకంగానైనా తెచ్చుకోగలిగిన వ్యక్తా? నాయకుడు ఎవరు? ఎవరికి వారు అవుతారా? ప్రకటనలు, ప్రలోభాల ద్వారా, ప్రజల ద్వారా, ప్రజల మధ్య నిలబడటం, వాళ్ళ బాగోగులు, వాళ్ళ భవిష్యత్ గురించి ఆలోచించటమేగాక అందుకు కృషిచేసే వాళ్ళా నాయకులు? లేదా వాళ్ళంతా నాయకులేనా? రెండు రకాలవారికీ తేడా లేదా? అందరినీ ఒకే గాటనే కట్టేయటమేనా? ఇప్పుడు జరుగుతున్నది అదేనా? మరి Leader కి Statesman కి తేడా ఏమిటి? ఆ తేడాని గ్రహించటం లేదా? గుర్తించటం లేదా? Statesman ఎన్నికలకతీతంగా పదవికోసమేగాక ఈసారికనో, ఈ ఒక్కసారికనో ఒక Term or Tenure ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించేవాళ్ళకీ తేడా లేదా? చంద్రబాబు 52 రోజులు రాజమండ్రి జైల్లో ఉంటేగాని, యువతీ యువకులు యుగళగీతం పాడి

గతం గుర్తుచేస్తే ఆయనకీ, ఇతర రాజకీయ ప్రత్యర్థులకీ తేడా గ్రహించలేక పోయారని తెలిసింది ఇప్పుడు.

ఎట్టకేలకు, ఎట్లాగొట్లా నారా చంద్రబాబునాయుడుగారిని 52 రోజులు జైలులో పెట్టగలిగారు. అట్లా పెట్టి వుండకపోతే ఈ రోజు చంద్రబాబుగారి రాజకీయ పునర్జన్మ ఇంత విస్తృతంగా వుండేదా? జైలుకెళ్ళటం ఎంతమంది తట్టుకోగలరు. ఎంతో గుండె ధైర్యమే గాదు, నమ్మకం, తన మీద తనకి, ప్రజలకు కూడా వుండబట్టే ఇప్పుడు ఈ Statesman అంకం కదా!

ఎన్టీఆర్– ఘంటసాలగారి "యువతీ యువకుల్లారా" అని ఏదో ఒక సినిమాలో 40–50 సంవత్సరాల కిందట, "పాడవోయి భారతీయుడా". అని ఇంకో సినిమాలోను పాడిన అద్భుతమైన పాటలు గుర్తుకొస్తున్నాయి. పెద్దమనుషుల్లో ' శివశివ మూర్తివి **గణనాయకా'** పాట కూడా. ఎన్.టి.ఆర్. '**మనదేశం'** సినిమా గుర్తుతెచ్చుకుంటే "Decoding a Leader" ఇంకా తేలికవుతుంది. హైటెక్ సిటీ 25 సంవత్సరాల ఉత్సవం గొప్ప మలుపుకు తోడ్పడిందంటే అతిశయోక్తికాదు. యువతీయువకులు మేల్కొంటే, తలచుకొంటే **మార్పు** కష్టం కాదేమో అనిపిస్తుంది. రాష్ట్ర భవిష్యత్ మళ్ళీ ఒక వెలుగు వెలగబోతోందన్న మాట. అదే ఈ Making of a Leader పుస్తకం. ఇంకా, ఇంకా ఈ దేశానికి కొత్తతరం నాయకులు ఎంతో మంది కావాలి, రావాలి కదా? రాజకీయాల్లో మార్పు కనబడాలంటే స్ఫూర్తికావాలి.

– **డాక్టర్ భాస్కరరావు,** జనవరి 30, 2024

సందర్భం

దేశంలో పార్టీ రాజకీయాలు దిగజారిపోయాయి. ఎట్లా దిగజారిపోతున్నాయో ముఖ్యంగా గత దశాబ్దంలో దుమ్మెత్తి పోసుకుంటామా అని మాట్లాడుకునే సందర్భంలో ఈ "Decoding a Leader" అనే పెద్ది రామారావు గారి పుస్తకం ఒక కోణం. కొత్త ఒరవడేగాక, చంద్రబాబు నాయకత్వం, ఆలోచనా విధానాన్ని విశదీకరించుతుంది. డాక్టర్ రామారావు చంద్రబాబుతో ఆరు సంవత్సరాలపాటు (2014– 2020) పనిచేసి, సహాయకుడిగా వుండి నిశితంగా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రత్యేకతే కాక రామారావు వ్యక్తిత్వం కూడా దానికి తోడ్పడింది అని చెప్పవచ్చు. ప్రత్యేక శైలిలో వ్రాసిన పుస్తకం. తెలుగులో వ్రాసినా దేశంలో నాయకుల విషయంలో కూడా ఆ విధంగా పుస్తకాల విశ్లేషణ వుంటే బాగుంటుందనిపించారు.

అయితే ఒక రాజకీయ నాయకుడు ఎట్లా అవుతాడు? ఎట్లా నేర్చుకోవాలి? ఇంకా బాగా చేయాలంటే, ఏ ప్రత్యేకతలు సమకూర్చు కోవాలంటే ఏ విధంగా ఆలోచించాలి? ఎలా మలచుకోవాలి? ఎలా తయారవ్వాలి అనేవి కూడా తెలిస్తే ఇంకా బాగుంటుంది. అయితే అది నాయకుడిగా పెరగటానికి, పెరిగే సమయంలో అంటే, మొదటి పది, పదిహేను సంవత్సరాలలోనే, అవకాశాలని ఏ విధంగా మలచుకోవాలి? అప్పుడే వ్యక్తిత్వంలో భాగమై నాయకుడుగా నాలుగు దశాబ్దాల పాటు నిలవటం సాధ్యం అవుతుంది. తరాలు మారినా కూడా అనే విధంగా చంద్రబాబు విషయంలో అది నాకు గుర్తుకొచ్చినంత వరకు కొంతవరకూ తెలిసిన విషయం. ఆయన పార్టీ రాజకీయాలు, ఎన్నికల రాజకీయాలు తట్టుకుని తన నాయకత్వానికి ప్రత్యేకత, వ్యక్తిత్వం విజృంభించటం, ముఖ్యంగా 1978–2014 మధ్య, ఎట్లా సాధ్యపడింది? అనేది కూడా తెలుసుకోవాలి. అదే నా ఈ ప్రయత్నం.

చంద్రబాబు మొదటి స్థానిక గురువు రాజగోపాలనాయుడు, ఆయన గురువు ప్రొఫెసర్ ఎన్.జి.రంగాగారు. అప్పుడు రంగాగారు దేశంలోని పెద్దనాయకులలో ఒకరు. ఆ ఇద్దరు నాయకులతోను అప్పటికే నాకు పరిచయం వుంది. రంగాగారితో బాగా కొన్ని సంవత్సరాలపాటు. రంగాగారి దగ్గర నుంచి ఒక విషయం చంద్రబాబు గ్రహించినట్లు తెలుస్తుంది. (రంగా గారి మీద తన పీహెచ్.డి. ప్రయత్నం వెంకటేశ్వర యూనివర్శిటీలో మానేసినా గాని). అదేంటి అంటే? జిల్లా నుంచి రాష్ట్ర నాయకత్వానికి పది కాలాలపాటు ఎదిగి నిలవాలంటే ప్రతి జిల్లాలో కనీసం ఇద్దరు, ముగ్గురు సమకాలీన సహచరులుండాలి. అదీ కులాలకతీతంగా అని గ్రహించి జతకట్టడం, కడప నుంచి రాజశేఖరరెడ్డి, కృష్ణాజిల్లా నుంచి పాలడుగు వెంకట్రావులతో దోస్తీ అట్లా మొదలైంది. శాసనసభకు ఎన్నికనప్పుడు మొదలైన స్నేహాలు అట్లాగనే. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి తర్వాత జిల్లాల వారీగా సహజ సహచరులను మొదటి నుంచి వున్న నాయకుడు చంద్రబాబే. అప్పుడు ఈ ముగ్గురు కలిసి ఢిల్లీలో నా దగ్గరకొచ్చి మేము కలిసి పనిచేయదలచుకున్నాం. మాకు ఢిల్లీలో మీ సలహాసంప్రదింపులు కావాలి అని కోరటం జరిగింది. అయితే అప్పుడే కొద్దికాలానికి ఇంకో విషయం చంద్రబాబు గ్రహించాడు. అదేమిటంటే కలసి ఉండవచ్చు, కాని రాష్ట్రనాయకత్వ మనుగడకి సొంత ఆలోచనలే కాదు, ప్రణాళికలు కూడా ఉండాలి, దానికి ఢిల్లీ అధిష్టానం ఆశీస్సులు, పార్టీ అండదండలు అవసరం అనేది. అందుకే ఆయన నా దగ్గరకు ప్రత్యేకంగా మళ్ళీ వచ్చి ఏదో ఒక పదవి పార్టీలో కావాలి అనే ప్రయత్నం. అప్పుడు యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గా నియమించబడటం. ఆచార్య రంగాగారి లాగా సమస్యని కూలంకషంగా చర్చించటం అనేది 1979 తర్వాత గాని అలవాటు అవలేదు. అయితే రంగాగారి లాగా రాజకీయాల్లో Ideological outlook ప్రయత్నించలేదు. ఆ తర్వాత ధ్యాస అప్పటి పశ్చిమ బెంగాల్ నాయకుడు జ్యోతి బాసు లాగా ప్రజల్లో పట్టు సంపాదించాలనే విషయం మీదకు మళ్ళింది. అప్పుడే, నేను ఇంకొక మిత్రుడు

శివరామప్రసాద్ కలిసి చంద్రబాబుని దేశ రాజకీయాలంటే అవగాహనేగాక, విధానాలలో ఒక స్టాండ్ ఉండాలి అని "**చంద్రబాబు ఆలోచనలు**" అని ఒక 25 పేజీల చిన్నపాటి పుస్తకం తీసుకురావటం జరిగింది. అంజయ్యగారి మంత్రివర్గంలో మంత్రిగా ఉన్న సమయంలో. కాంగ్రెస్ అయితే అది అనుకున్నట్టు బాబు సిద్ధాంతాల దృక్పథానికి ఉపయోగపడలేదని చెప్పవచ్చు. కారణం రాష్ట్ర రాజకీయాల్లో **ఎన్టీఆర్ ప్రభంజనం** ఉవ్వెత్తున లేచి తెలుగుదేశంపార్టీగా ఆవిర్భవించటమే గాక తొమ్మిది నెలల్లోనే తిరుగులేని సుస్థిరతకు ప్రతి జిల్లాలోను ఊపందుకోటం. ఆచార్య రంగాగారి గురించి చేయతలపెట్టిన పీహెచ్.డి.ని చంద్రబాబు పూర్తిచేసి వుంటే Ideology (సిద్ధాంతాలు) ప్రాముఖ్యత ఏమిటో ఎంతవరకు తెలిసిందో కాని ఆయన రోజువారీ రాజకీయాల్లో ఎన్టీఆర్ సహాయకుడిగా మునిగిపోయారు.



ఆ పరిచయం నుంచే.,


1978 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికైన యువకులలో ముగ్గురూ మూడు నెలలవగానే ఢిల్లీ వచ్చి వాళ్ళ పార్టీ పెద్దలను కలిసి, నన్ను కలవడానికి మా ఇంటికి ఫోన్ చేయకుండానే వచ్చారు. ఎవరికి వారు ఢిల్లీ వచ్చి కలిసి పార్టీలో కార్యక్రమాలు చేయాలి అని వాళ్ళ ఆలోచనలు చెప్పి '**కలసి పనిచేస్తాం**' అని నాతో చెప్పిన విషయం మరచి ఏదో పదవి కావాలి అనే కాంక్ష వ్యక్త పరచటం జరిగింది. అయితే నారా చంద్రబాబు మాత్రం నన్ను తరచు కలసి ఎన్నో విషయాలు, ఆయన అప్పటి గురువుగా భావించిన పార్లమెంటు సభ్యులు రాజగోపాలనాయుడు ప్రజలతో ఏ

విధంగా మమేకంగా చేసిన కార్యక్రమాలను విశదీకరించేవాడు. మొత్తంమీద కొద్ది నెలల్లోనే ఆయన నాకు మిత్రుడయ్యాడనే భావన కలిగించాడు. ఏదో ఒక విషయం సందర్భంగా, అడగటానికో, తెలుసుకోటానికో తరచూ ఉదయాన్నే ఫోన్ చేస్తూ వుండేవాడు.

చంద్రబాబుతో నా పరిచయం 1978 నుంచి. అది ఆయన తెలుగుదేశంలో చేరక ముందు నుంచి. ముఖ్యమంత్రి అవ్వక ముందు నుంచి అని ఒక్కసారి గుర్తు తెచ్చుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది అట్లాగా అని! దేశంలో ఏ ఇతర రాజకీయ నాయకుడితో నా పరిచయాలు 20 సంవత్సరాలకు మించి లేవు. మరి చంద్రబాబుతో ఇంతకాలం ఎట్లా ఇన్ని సంవత్సరాలు! ఎన్నో సందర్భాలు కూడా!! విభేదించిన సమయాలు కూడా లేకపోలేదు. అయితే ఎప్పుడూ మా మధ్య ఇచ్చిపుచ్చుకునే ఆలోచనే లేదు, రాలేదు. నిక్కచ్చిగా చెప్పాలంటే ఒక్క రూపాయి కూడా ఇన్ని సంవత్సరాలలో ఆయన దగ్గర నుంచి గాని, ఆయన ప్రభుత్వం దగ్గర నుంచి గాని నేను తీసుకోలేదు. **విజన్**–2020 కి దాదాపు సంవత్సరంపాటు పనిచేసినా కూడా లేక్ వ్యూ గెస్ట్ హౌస్ లో ఉండడం జరిగింది. ఎన్నో విషయాల్లో, ఎన్నో రకాలుగా సహాయపడినా, అట్లాంటి ప్రస్తావనే ఎప్పుడూ మా మధ్య రాలేదు. ఆయన పిలిస్తేగాని నేను వెళ్ళలేదు. బాధ్యతలు అప్పచెప్పటంగాని, ఎంక్వయిరీగా ఏ విషయంలోనైనా చేస్తే దాని మీద నాకు చేతనైన విషయాలు వివరించి తెలియజేయటం, ఒక రిపోర్టు ద్వారానో, కలిసినప్పుడో చెప్పటం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల ద్వారా ఎట్లాంటి సంబంధాలు పెట్టుకోలేదు, ప్రయత్నించలేదు కూడా. అది మా స్నేహానికి మంచిది కాదనే విషయం ఇద్దరం గ్రహించడమే అందుకు కారణం.

ముప్పయి సంవత్సరాలలో మూడు, నాలుగు సార్లు మాత్రమే నాకై నేనే ఒక్కడినీ వెళ్ళి కలసి ఉంటా. రెండుసార్లు తెలుగు ఐఏఎస్ మహారాష్ట్ర కేడర్ అధికారి

కేబినెట్ సెక్రటరీ పదవికి ఎంతో అర్హత వున్నదని చెప్పటానికి ఆ పద్మనాభయ్యగారిని తీసుకెళ్ళి పరిచయం చేశా. అయితే చంద్రబాబు ఆ చొరవ చూపించే ఆలోచనలు వేరు. ఇంకోసారి డాక్టర్ చంద్రశేఖరరావుగారు అప్పుడు ఆయన ప్రపంచ కోర్టు జెనీవాలో ఇండియా జడ్జి ఆయన నేను BREAD (విద్యారంగంలో సేవచేయటానికి ఏర్పరచిన సంస్థ) పనిమీద విజయవాడ వెళ్తే ఆయన చంద్రబాబుని ఒకసారి మర్యాదపూర్వంగా కలవచ్చు ఏమో అన్నారు. ఫోను చేస్తే ఉదయాన్నే ఇంటికి పిలిచారు. (మర్యాదపూర్వకంగా మాట్లాడారు).



అతీతంగా ఆలోచించటం

ఎన్టీఆర్– టీ.డీ.పీ. ఒక మహాశక్తిగా పాతుకుపోయిన నేపథ్యంలో రాజకీయాల్లో కులమతాలకు అతీతంగా ఆలోచించటం ఒక ప్రత్యేకతగా భావించాలి. అప్పుడు కొంతమంది నాయకులు పార్టీపరంగా ఎదుర్కొన లేక కుల,మత, ప్రాంతీయ తత్వాలని రెచ్చగొట్టటం జరిగింది. ఎన్టీఆర్ హయాంలో జరిగినంత కులాలకు అతీతమైన రాజకీయాలు అంతకు ముందు, ఆ తర్వాత జరగలేదు. ఆ కొద్దికాలంలోనే ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీర్ దాదాపు 20,000 మంది కొత్తతరం వారికి – ఎక్కువ మంది అంతకు ముందు ప్రాతినిధ్యంలేని వర్గాల

నుంచే– అవకాశం ఇచ్చి ప్రోత్సహించాడంటే అతిశయోక్తి కాదు.. ఆయన తర్వాత, చంద్రబాబు మీద కులముద్ర వేయటం అప్పుడే అట్లాగే మొదలైందని చెప్పవచ్చు. ఏదో పత్రికలు, టీవీల వాళ్ళ కులం తెలిసినంత మాత్రాన, రాజ్యం వాళ్ళదే అని ముద్ర వేసి, వాడుకలోకి తేవడం రాష్ట్ర దురదృష్టం. ఆ పేరుతో, ఆ తర్వాత ప్రజలని ప్రాంతాలవారీగా విడగొట్టటానికే ఆ ప్రయత్నాలు, కుతంత్రాలే. అవన్నీ నిశితంగా ఆలోచించి, పరిశీలించితే గాని ఆ విషయంలో నిజానిజాలు తెలియవు. అయినా చంద్రబాబుని ఆ తతంగంలోకి, ఊబిలోకి లాగటం జరిగింది. ఆయన ఎంత ప్రయత్నించినా అప్పుడు బయటకు రాలేకపోవడం, అది అభివృద్ధికి అవరోధం అవ్వటమేగాక, ఆపోహలకు గురయ్యా డనిపిస్తుంది. 'రాజకీయాల్లో ఇది సహజం' అనే ధోరణిలో పరిగణించి ఆ దృష్టితో పార్టీలను నాయకులు నడపటం రాష్ట్ర దురదృష్టం.

1954 లో అనుకుంటా "**పెద్ద మనుష్యులు**" అనే సినిమా వచ్చింది. నాయకులు విలక్షణ ధోరణి ఎలా చేపడతారో హెచ్చరించారు. కులగోత్రాలు లాంటి అనేక సినిమాలు కులమతాలకు అతీతంగా తెలుగులో వచ్చాయి. కొన్ని బాగా ప్రజాదరణ కూడా పొందాయి.

అయితే ఆలోచనలో మార్పు తీసుకురాలేక పోవటమేకాక, అవి ఒక కారణంగా (Factor) మిగిలాయి దీనికి తోడు ఏ నాయకుడూ ఈ విషయాన్ని, ఈ విషబీజాన్ని పీకేయడానికి, నిర్మూలించడానికి ప్రయత్నించలేదు. అంత ధైర్యం ఎవరికి రాలేదు. ఏ నాయకుడూ కనీస ప్రయత్నాలు కూడా చేయలేదు. చంద్రబాబు మొదటి దఫాలో చేతల్లో ప్రయత్నించాడు, మాట్లాడాడు కూడా. చాలా వరకూ స్థానికంగా, జిల్లాల్లో, పార్టీలో, ప్రభుత్వంలో కూడా, అది సరిపోలేదు. భాష్యం చెప్పేవాళ్ళు లేక, చెప్పేవాళ్ళు సరైన రీతిలో చెప్పలేకపోవడం అప్పుడు పార్టీలోపం అనాలి. ఎన్ని ట్రైనింగ్

కార్యక్రమాలు చేసినా ఈ విషయంలో ఏ మాత్రం మార్పు తీసుకురాలేకపోయారు. మంచి రాజకీయాలకి రోజులు మూడాయా అనే రీతిలో.

కొత్త ఆలోచనలు చంద్రబాబు వినటం గాని, తెలుసుకునే విధంలో గాని అప్పట్లో చూస్తే, ఆయనకి సొంత లాభానికి అంటూ వేరే అజెండా లేదేమో అనిపించక తప్పదు. ప్రజలకి ఏ విధంగా ఉపయోగపడుతుంది? అభివృద్ధికి ఎట్లా దోహదపడుతుంది? అనేవే లక్ష్యాలుగా ముందుకు సాగాడు. అందుకే చంద్రబాబు రాజకీయమే సర్వస్వం అనే రీతిలో ప్రారంభించాడని అనిపిస్తుంది. అయితే మొహమాటం, బిడియం అనేవి ఒకోసారి కొంచెం ఎక్కువ పాళ్ళలో వున్నట్లు కనపడుతుంది. అదే కొన్ని అపార్థాలకి కారణమా అన్నట్లు ఎక్కువ పాళ్ళలో విమర్శలని ఎదుర్కోవటం చూశాం. ఎన్ని విమర్శలు వచ్చినా చంద్రబాబు మాత్రం ఎప్పుడూ తన హావభావాలు చూపించలేదు. కోపతాపాలకి తావివ్వలేదు, ఎక్కడా కనపరచలేదు. అట్లాంటి సంఘటనలని గురించి కూడా వినలేదు. His tolerance level in politics is unparallel nationally. This is what could be described as "Positive Politics". జాతీయస్థాయిలోనే రాజకీయాలలో ఆయనకు సాటి మరెవరూ లేరు. వీటినే పాజిటివ్ రాజకీయాలు అనవచ్చు. కార్యనిర్వహణలో కొత్త ఆలోచనలని స్వాగతించటంలోనే కాకుండా, కొద్ది మంది నాయకుల పట్ల ఆయన తీసుకునే జాగ్రత్తలు ముందుగానే ఆలోచిస్తారు.

చంద్రబాబుతో సంబంధాలు ఎంతవరకు?

చంద్రబాబుతో చాలా ఆలోచనలు జరిగినవి (1979-2000 మధ్య) ఆయనతో సహకరించడం జరిగింది. అయితే చంద్రబాబుతో, ప్రభుత్వంతో, పార్టీతో గాని రాష్ట్రంలో, అన్ని సంవత్సరాలలో కూడా, ఎలాంటి లావాదేవీలూ, ఏ రూపంగానైనా ఇచ్చిపుచ్చుకోవటాలు, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లాభం పొందలేదు.

ఒకసారి ఎప్పుడో మా నాన్న నాతోపాటు వుండడం చూసి ఆయన్ని గురించి అడిగి, "అలాగా! లైబ్రరీల కోసం ఇన్ని సంవత్సరాలు కృషి చేసి ఖాళీగా వుంటున్నారా? మిమ్మల్ని గ్రంథాలయ సంఘ సంస్థకి నియమిస్తాను. మీరు గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తూ ఉండాలి" అని ఆయనంతటికి ఆయనే చెప్పాడు. అయితే అది ఎప్పుడూ జరగలేదు. నేనూ, ఆ తర్వాత ఎప్పుడూ గుర్తు చేయలేదు. మా నాన్న కూడా అసలు ఆశించలేదు, మరచిపోయాడు.

ఒకోసారి 'మీ ఊరు ఎక్కడ? నేను వస్తాను, నేను చూడాలి.' అన్నారు. ఆయన వస్తే బాగుంటుంది, గ్రామానికి ఏదో ఒక రకంగా ఉపయోగపడుతుందని వివరాలు చెప్పా. అయితే చుట్టుప్రక్కల గ్రామాలకి వచ్చినా కూడా ఎప్పుడూ రాలేదు. గుర్తు వుంటే కదా. అది అప్పటి విషయంగానే మిగిలిపోయింది. నేను ఎప్పుడూ రెండోసారి గుర్తు చేయలేదు.

ఒకసారి 1994లో నేను చంద్రబాబుతో వుండగా ఒక ప్లానింగ్ సెక్రటరీ– శర్మగారనుకుంటా– వచ్చాడు. "ఈ డాక్టర్ భాస్కరరావుగారు ఢిల్లీలో చాలా కార్యక్రమాలలో వున్నారు. ఎన్నో మంత్రిత్వ శాఖల(మినిస్ట్రీ) కార్యక్రమాల పరిశీలనలో వుంటారు. ఆయన సహకారం తీసుకోవచ్చుగా" అనికూడా బాబుతో అన్నారు. అంతే, అంత వరకే.

అధికారంలో వున్న నాయకులతో ఏదైనా పనులు చేయించుకోవడం సహజంగా జరిగేది. అయితే ఈ పనులు ఎట్లాంటివి? సమాజం కోసమా? సొంత లాభానికి సంబంధించినవా? **జన్మభూమి** అప్పుడు నేను మా ఊరులో ఒక ఆడపిల్లల పాలిటెక్నిక్ కళాశాల పెట్టటానికి కావాల్సిన మూలధనం ఇవ్వటానికి సిద్ధమై ఆ విషయం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళాను. అయినా ఏమీ జరగలేదు, తర్వాత అడగలేదు కూడా. ఇంకోసారి మా ఊళ్లో చంద్రయ్య కాలువపై గ్రామస్తుల కోర్కెని తెలియజేశా. అప్పటి చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావుగారు ఆ చుట్టుప్రక్క గ్రామం

నుంచి వచ్చినవారే. ఆయనకి కూడా చెప్పా. ఇంకోసారి మా అత్తగారి ఊరులో స్మశానం అభివృద్ధిని గ్రామస్థులే చేసుకుంటుంటే స్థానిక అధికారులు అనేక అడ్డంకులు కలుగజేశారు. ఆ విషయం కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్ళా. ఏమీ జరగలా. విషయం ఏమిటంటే ఇవేవీ మా మధ్య సంబంధాల్లో ఏ విధమైన తేడాకి దారి తీయలేదు. అయితే మా ఊరిలో మహిళా మండలికి గ్రామ మధ్యలో మా స్థలం ఇచ్చి, భవననిర్మాణానికి డబ్బు ఇచ్చినా, సంవత్సరం అయినా పని జరగలేదు. స్థానిక ఎం.పీ., మంత్రి వడ్డే శోభనాద్రికి చెబితేకాని పని జరగలేదు. అప్పుడు గ్రహించాను, స్థానిక పార్టీల జోక్యం ముఖ్యం అని. ఆ మహిళా మండలి కోసం నేను అప్పుడు కట్టించిన బిల్డింగ్ లోనే గ్రామ సచివాలయం, గ్రామ పంచాయతీలోనే కార్యాలయాలు ఇప్పుడు...

నాయకత్వానికి బలం చేకూర్చుకోవటం

చంద్రబాబుకి రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానానికి మూల అయినటువంటే అనుభవాలు ఏమిటి?. తన కాళ్ళమీద తను సామర్థ్యం, ముందు చూపు అవకాశాల మీద దృష్టి, కార్యకర్తల వివరాల అరచేతిలో విషయం తెలియజెప్పే విధానం, పద్ధతులు, భవిష్యత్ బాటలాంటి విషయం, పరిజ్ఞానమే ముందు ముందు నాయకుడిగా తీర్చిదిద్దిన విషయాలు.

వ్యాపార ఆవశ్యకత

అప్పుడు (ఇప్పుడు ఇంకా ఎక్కువ కూడా) క్రియాశీలక రాజకీయాలలో నిలబడాలంటే ఆర్థికంగా స్తోమత వుండాలి. లేకపోతే ఎవరిమీదో ఆధారపడాలి అనేది తెలిసిన విషయమే. అయితే లంచగొండి ఒత్తిడులకు దిగజారటానికి కూడా అదే కారణం. అందులోంచే ఆ కార్యకర్తల భవిష్యత్ బాట, పేరు.

ఆ అవసరాలకు లొంగిపోకుండా వుండగలిగినప్పుడే గదా కార్యకర్తనుంచి నాయకుడిగా ఎదిగే అవకాశం.

అదే చంద్రబాబు ప్రత్యక్ష పార్టీ రాజకీయాలలో అడుగుపెట్టినప్పుడే గ్రహించిన విషయం. నిర్దిష్ట, నిష్పాక్షిక రాజకీయాలు చేయాలంటే ఏదో ఒక వ్యాపారం వుంటేనే సాధ్యం అని ముందే గ్రహించటం. ఆ వ్యాపారం కూడా స్థానికంగా పదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఉండాలని భావించటం. ఇంకొకళ్ళ మీద ఆధారపడకూడదు, పదవితో సంబంధం లేకుండా ఆ వ్యాపారం ఉండాలని కూడా భావించటం.

పాడితో సంబంధించిన వ్యాపారం అయితే సామాన్య రైతు కుటుంబాలకు, ముఖ్యంగా మహిళలు కూడా పాల్గొనే విధంగా ఉంటే ఇంకా మంచిది అని గ్రహించటం. హెరిటేజ్ పాల పరిశ్రమ ఆ విధంగా ఆవిర్భవించిందే. మొదటగా చిత్తూరు ప్రాంతం నుంచి మద్రాస్, బెంగళూరు నగర ప్రాంతాలకు పాలు, పెరుగు సరఫరాతో మొదలుపెట్టడం జరిగింది. అప్పుడు హైదరాబాద్లో నిజాం హాస్పిటల్ పక్కనే చిన్న కార్యాలయం కూడా మొదలు పెట్టాడు. ఆయన ఎం.ఎల్.ఏ. గా ఎన్నికై హైదరాబాదులో ఎక్కువ సమయం గడపటం మొదలైంది. అప్పుడు నేను హైదరాబాదు వచ్చినపుడు ఆయన్ని మర్యాదపూర్వకంగా ఆ ఆఫీసులో శివరామప్రసాద్ తో సహా కలవటం జరిగింది. అప్పుడే ఆయన మద్రాస్, బెంగళూరులో స్థానిక పాలసరఫరా విధానాలని గురించి, ఏ విధమైన పోటీని తట్టుకోవలసి వస్తుందనే విషయాల మీద తర్జనభర్జన పడటం గ్రహించాను. నాకప్పుడు రెండు నగరాలు, రాష్ట్రాలలో రీసెర్చి బృందాలు నెలనెలా రిపోర్టులు ఇవ్వడంవల్ల దేశంలోనే పేరొందిన మొదటి సంస్థ (ORG) ఆ Field workers ద్వారా మద్రాస్, బెంగళూరు, ఏ పాలు,ఏ ప్యాక్ లో, ఎంత ఖరీదులో అమ్మితే పోటీ తట్టుకోగలదో అనే విషయం మీద రిపోర్టు తయారు చేసిచ్చాను.

దాని ద్వారా Field survey team వుంటే ఎట్లా ఉపయోగపడుతుందో, అదీ Independent source ద్వారా అయితే ఇంకా మంచిది అని గ్రహించటం. అట్లాంటి రిపోర్టు నెలనెలా అయితే ఎంత ఉపయోగమో, ఏ విధంగా పథకాలు చేయవచ్చో తెలుసుకోవటం, అనుకోకుండా ఆలోచనలని ఏ విధంగా ఏర్పరచుకోవాలో తెలియజేయటం జరిగింది. సంవత్సరాల తర్వాత అదే పద్ధతులు రాజకీయపార్టీ సమన్వయంలో, ప్రభుత్వ నిర్వహణలో ఉపయోగపడ్డాయి.

తిరుపతి, ముందు ముందు

1982 లో అనుకుంటా. తిరుపతిలో ఒక మంచి హొటల్ **విష్ణుప్రియ** పెట్టింది చంద్రబాబే. బస్సుస్టాండ్ రోడ్డులో అప్పుడది ఒక ల్యాండ్ మార్కు. అయితే అది భీమా హొటల్ తర్వాత అంతే ప్రాముఖ్యంలోకి రావాలి. అంటే ఆ హోటల్ ఒక టూరిస్ట్ సెంటర్ అవ్వాలి. ఎట్లా? అదీ అప్పుడు చంద్రబాబు ముందున్న ఒక సమస్య. అప్పుడు అన్నారావుగారు తిరుపతి దేవస్థానానికి ముఖ్య అధికారి, ఎప్పటి నుంచో ఏడు కొండల అభివృద్ధికి కృషి చేసిన మహానుభావుడు కూడా. అప్పుడు తిరుపతికి విమాన సౌకర్యం లేదు. మద్రాసులో దిగి రావాల్సిందే. అప్పుడు తిరుపతిలో ఇండియన్ ఎయిర్లయిన్స్ ప్రారంభించాలని ఒక వినతిపత్రం అన్నారావుగారి ద్వారా, ఇంకా ఇతరుల ద్వారా పంపారు. ప్రయత్నించితే ఆ పని అవ్వాల్సిందే. చంద్రబాబు నైతికం మొదటి నుంచి అంతే.

ఒక రోజు నాకు ఢిల్లీకి ఫోన్ చేసి తిరుపతిలో తన హొటల్ మంచి సెంటర్లో ఉన్నదని, ఇండియన్ ఎయిర్లయిన్స్ సర్వీస్ మొదలు పెట్టబోతోందని చెప్పారు. తన హొటల్లో వాళ్ళ ఆఫీసు పెడితే బాగుంటుందని, అది తనకు కూడా ఉపయోగ పడుతుందని, ఇండియన్ ఎయిర్లయిన్స్ లో ఎవరితోనైనా మాట్లాడగలరా? ఈ ప్రతిపాదన వాళ్ళ చెవిలో వేయగలరా? ఇవి ఆయన నన్ను అడిగిన ప్రశ్నలు. నాకు అప్పుడే ఓఆర్ జీ ఇండియన్ ఎయిర్ లైన్స్ కి ప్రయాణీకుల రిజర్వేషన్ సాఫ్ట్ వేర్

ప్రాజెక్ట్ (Passinger reservation software Project) చెయ్యడం మొదలు పెట్టింది. ఆ సందర్భంగా వాళ్ళపై అధికారులతో పరిచయం నాకు కూడా ఏర్పడింది. అప్పుడు ఆ సంస్థ Finance Director సేన్ గుప్తా గారితో చంద్రబాబు ప్రస్తావన చెప్పాను. ఆయన వెంటనే ఫోనులో తెలుసుకుని, ఆ ప్రతిపాదనను పరిశీలించవలసిందిగా అక్కడి అధికారులని కోరారు. తిరుపతిలో ఆ హోటల్ ఇండియన్ ఎయిర్లయిన్స్ ఆఫీస్ ప్రారంభానికి నాంది అట్లా అయింది. అది 40–45 ఏళ్ళ క్రితం చంద్రబాబు చొరవ, దూరదృష్టి, తిరుపతి అభివృద్ధికి ఏ విధంగా తోడ్పడిందో ఈ రోజు చూస్తే తెలుస్తుంది. రాబోయే మార్పులు ఊహించటం, వాటి ప్రభావాలను గూర్చి ఆలోచించటం అప్పటి నుంచే మొదలైందనటానికి ఇదొక జ్ఞాపకం. ఒక airlines connectivity ద్వారా ఎన్ని మార్పులు ఎంతగా తీసుకురావచ్చో, ఏ తీగ లాగి డొంకంతా ఎట్లా కదిలించవచ్చో తెలుసుకోవటం అంటే అదేగా!

కంప్యూటర్ ఉపయోగం



1986 లో అనుకుంటా చంద్రబాబుకి తెలుగుదేశం కార్యాలయం బాధ్యతలు అప్పచెప్పారు ఎన్టీఆర్ గారు. ఎంతో ఆలోచన తర్వాత ఆ వెంటనే జనరల్

సెక్రటరీ అవ్వటం కూడా జరిగింది. నారాయణగూడా పెట్రోల్ బంక్ పక్కన ఓ మేడలో తెలుగుదేశం కార్యాలయం మొదలైంది.

అది హైదరాబాద్ లో కూడా కంప్యూటర్స్ ఏ ఇద్దరు ముగ్గురో ప్రముఖంగా ఉపయోగిస్తున్న సమయం. పార్టీలో తన పట్టు వుండాలంటే, పార్టీలో వాళ్ళ అందరి వివరాల సేకరణ చంద్రబాబు ముందున్న సమస్య. జిల్లా కార్యకర్తలు, పార్టీ నిర్వాహకులు వాళ్ళ అడ్రస్ లు అన్నీ వివరంగా వుండాలి.

అప్పుడే పార్టీ నిర్మాణం సాధ్యం అనే ఆలోచనతో సతమతమవుతున్న సమయంలో ఒకరోజు ఆ ప్రస్తావన తీసుకువచ్చారు నాతో. అప్పుడే **ఓఆర్టీ** ORT చిన్నపాటి టేబుల్ మీద వాడే కంప్యూటర్ని దేశంలో మొదటిసారి తీసుకువచ్చింది. (DCM, HCL కంపెనీలు కూడా అదే సమయంలో ప్రవేశ పెట్టారు) అప్పుడు **ఓఆర్జీ** ఆ కంప్యూటర్ మీద హైదరాబాద్లో పనిచేస్తున్న నందిగామ కుర్రాడి ద్వారా చంద్రబాబు నారాయణగూడ ఆఫీసులో కూర్చుని ఆయనికి కార్యకర్తల వివరాలన్నీ కంప్యూటరులో ఎలా ఎక్కించాలో, ఎట్లా ఎప్పుడు కావాలంటే అప్పుడే, వాడుకోవచ్చునో తెలుసుకున్నాడు. అదే అప్పుడు చంద్రబాబుకు కంప్యూటర్ తో తొలి పరిచయం, మొదటిసారి ఉపయోగించటం కూడా. భవిష్యత్లో ఏ విధంగా కంప్యూటర్స్ ను ఉపయోగపెట్టుకోవచ్చునో అనే ఆలోచనకి నాంది. 25 సంవత్సరాలలో ఈ కంప్యూటర్స్, వాటి ఉపయోగవిధానాలలో ప్రముఖపాత్ర వహించే అవకాశం వస్తుందని ఆయన కూడా ఊహించి ఉండడు బహుశా. దేశనాయకుడిగా తన అభివృద్ధికి ఎట్లా ఉపయోపడుతుందనే విషయంలో కొత్త అనుభవాల నుంచి గ్రహించటం చంద్రబాబుకి తేలికైన విషయం.

ఆర్థిక మంత్రిగా తెరముందుకి

కొన్ని సందర్భాలు విచిత్రాలకి కూడా మూలం అవుతాయి. కొన్ని కొంతమంది జీవితాల్లో మలుపుకి మూలాలవుతాయి. ఇంకా కొన్ని సంఘటనలు దేశ చరిత్ర దిశ, దశనే మార్చుతాయి. అట్లాంటిదే ఈ సందర్భం. అదే చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రిగా ఢిల్లీ విజ్ఞానభవన్లో రాష్ట్ర ఆర్థికమంత్రుల సభకి మొట్టమొదటిసారి తన బడ్జెట్ గురించి మాట్లాడటానికి ఆ శాఖ సెక్రటరీతో సహా ఢిల్లీ రావటం. రేపు ఉదయం సమావేశం అనగా ఆ సాయంత్రం నాకు ఫోన్ చేసి తన మొదటి బడ్జెట్ ఎంత గొప్పగా చేశాడో చెప్పి విజ్ఞాన భవన్లో పంచే బడ్జెట్ రిపోర్టు కాపీని ఎంతో ఉత్సాహకరంగా హుషారుగా చూపించారు. అప్పట్లో ఆయనకి ఢిల్లీలో సీదాసాదాగా మాట్లాడుకొనేది నేనొకడిని అనుకుంటా.

4.30 గెస్ట్ హౌస్ కు వెళ్ళగానే చంద్రబాబు ఆ బడ్జెట్ ఉపన్యాసం నాకు చూపించి, 'రేపు దీన్ని విజ్ఞాన భవన్లో ప్రెజెంటు చేస్తాను' అని గొప్పభావంతో చెప్పాడు. అప్పుడు ఆయన ఇంగ్లీషులో హృదయం విప్పి మాట్లాడే విధానం అక్కడ వాళ్ళకి అర్థం అవ్వటానికి టైమ్ పడుతుంది. ఆ ప్రెజెంటేషన్ లోని ముఖ్యమైన మూడు విషయాలు క్లుప్తంగా చెప్పమంటే ఆయన కొద్దిగా ఇబ్బంది పడ్డాడు 'నా ఇంత పెద్ద ప్రజెంటేషన్లో మూడేనా' అని. అయితే ఆ మూడు చెప్పటానికి కూడా ఏకధాటిలో కష్టమైంది. అప్పుడు ఆ బడ్జెట్ రిపోర్టు కాపీని ఆయనకు ఇచ్చేసి 'ఇది చదవద్దండి. దీంట్లో 4–5 ముఖ్యవిషయాలు ఒక ఓవర్ హెడ్ ప్రొజెక్టర్ మీద చూపించి మీరు ఎంత క్లుప్తంగా మాట్లాడితే అంత ఎక్కువ అర్థం అవ్వటానికి అవకాశం వుంటుంది. మీ ప్రత్యేకతని చూపించాలి కదా' అని చెప్పా. మిగిలిన రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కూడా ఇట్లాగే చదువుతారు. మరి మీరు అందరిలా కాకుండా ఒక కొత్తరకంగా ప్రజెంటు చెయ్యండి. దీన్ని Plastic sheet మీద 6–7 కి మించకుండా ఒక్కో sheet లో 2–3 లైన్లు ఒక చిన్నపాటి లెక్కల టేబుల్

మాత్రమే ఉంటుంది. అది తయారు చేస్తే బాగుంటుందని సలహా ఇచ్చా. కొంచెం నిరుత్సాహ పడ్డాడు కాని కోపం రాలేదు ఆయనకు. వెంటనే పక్క గదిలో వున్న Finance secretary ని ఇతర ఆఫీసర్స్ని పిలిచి నేను చెప్పిన విధంగా 7, 8 పేజీల ఓవర్ హెడ్ ప్రొజెక్టర్ మీద ప్రజంటేషన్ కు తయారు చేయమన్నాడు. అప్పుడు ఆ Secretary' ఆరుగంటలవుతుందండీ, ఇప్పుడు అట్లా చేయటం కష్టం. గెస్ట్ హౌస్లో ఆ సదుపాయాలులేవు. తరువాత చేద్దాం అన్నాడు.

ముఖ్యమంత్రి రామారావుగారికి కొత్తపోకడలు రోజువారీ పనే. ముఖ్యంగా ఢిల్లీలో ఆంధ్రా ప్రత్యేకతని తెలియజేయాలనే కుతూహలతే కాదు. విధానం కూడా. చంద్రబాబుకు ఆ విషయం బాగా తెలుసు. అందుకని కూడా నేను చెప్పిన ఆలోచన నచ్చింది. ఇతర రాష్ట్ర ఆర్థిక మంత్రులలాగా కాక ఒక ప్రత్యేక పద్ధతిలో విజ్ఞానభవన్లో ముద్రవేయాలని ఒప్పుకున్నాడు.

అయితే ఆ ఆర్థికశాఖ అధికారులు ఆ సలహాను అమలుచేయడానికి సమయం లేదు, అట్లా ప్రజెంటేషన్ ఇప్పుడు తయారు చేయలేమంటూ సమాధానంతో సంతృప్తి చెందారు. అయితే చంద్రబాబు కూడా ఎన్టీ రామారావుగారి లాగానే పట్టుదల చూపించారు. అప్పుడు నేను ఆ అధికారులకి 'మీరు ముందు ముఖ్యమైన విషయాలు 5-6 పేజీలలో వ్రాయండి. ఆ తర్వాత ఢిల్లీ Connaut Place లో superbazar పక్కనే ఒక షాపుంది, అక్కడ overhead projector లో ప్రజంటేషన్ కు కావాల్సిన విధంగా plastic sheets ని తయారు చేస్తారు' అని చెప్పి ఒక ఆఫీసర్ని వెంటనే అక్కడికి పంపి తయ్యారుగా వుండమని చెప్పడం జరిగింది. అప్పటికి 8 గంటలైంది.

అప్పటికి (1994) Computer ద్వారా Power point presentation ఇచ్చే అలవాటు ఇంకా మొదలవలేదు. overhead presentation లు కూడా అంతగా అలవాటు కాలేదు. ఏ కొద్దిమందో రాజకీయ నాయకులకి మాత్రమే

రిపోర్టులు చదవడం, పంచటం, క్లుప్తంగా చెప్పడం తెలుసు అప్పటి వరకు. చంద్రబాబు అప్పుడు విజ్ఞాన భవన్లో ఆర్థిక మంత్రుల్లో మొదటిసారి ఆ విధంగా తన బడ్జెట్ ప్రాముఖ్యతని గూర్చి తెలియజేసే ప్రయత్నం చేశారు.

విజన్ ఆలోచన మూలాలు

అప్పుడే అభివృద్ధి భిన్నంగా వుండాలంటే, ఆర్థిక సంపద ఆలోచనలలో మార్పు రావాలని, అప్పుడే ఒక కొత్త ఒరవడిని గురించి తెలుసుకోవాలని అడగటం ప్రారంభించాడు చంద్రబాబు. అయితే అది సమగ్రంగా చెప్పలేకపోయారు. దేశంలోనే అప్పటి దేశ ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి ఆర్థిక ఊబిలోంచి దేశాన్ని బయటపడేసే ప్రయత్నాలలో వున్నారు. వాళ్ళు ఆలోచనలో మార్పులు, భవిష్యత్ గురించి ప్రజలని ఆలోచింపచేయటం కాదు. ఆర్థిక మాంద్యంలోంచి దేశాన్ని గట్టు ఎక్కించాలనే ఆతృతే ఎక్కువ. ప్రాంతాల మధ్య కొట్టొచ్చే విధమైన తేడాలు, ఆర్థికవ్యత్యాసాలు పెరుగుతున్న విషయం తాత్కాలిక అవసరాల మీద ధ్యాస పెరిగింది అని చంద్రబాబు గ్రహించటమే గాక, వాటి ప్రభావం భవిష్యత్ లో పెద్ద సమస్య ఆవుతుంది కనుక ఆ విషయాలను గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు..

అప్పుడే (1994)లో నేను 1986 లో 'India-2021 అనే వ్రాసిన పుస్తకం చంద్రబాబుని ఆకర్షించటమేగాక విషయాన్ని ముందుకు తీసుకువెళ్ళే ఆలోచనని '**విజన్ – 2020**' ద్వారా ప్రయత్నించాడు.? అదే ఆయన్ను గొప్ప ఆలోచనాపరుడుగా పరుగెత్తించింది కూడా.

విజన్ - 2020 మొదలు పెట్టింది నా ఆలోచనలతో. సెక్రటరీలందరితో ఆయన ఇంట్లో తెల్లవారు జామున 5 గంటలకు విషయం మొదలైంది. దాని కోసం 12 కమిటీలతో మొదలుపెట్టి మర్రి చెన్నారెడ్డి Institute లో అధికారులకి

వివరించటం జరిగిన తర్వాత, జరిగిన విభేదాల వల్ల ,నేను ఢిల్లీ వెళ్ళిపోయా. మళ్ళీ నన్ను పిలవలేదు. మెకంజీ వాళ్ళ ఆధ్వర్యంలో రిపోర్టు తయారుచేశారు. ఆ రిపోర్టు గవర్నరుగారు పబ్లిక్ గార్డెన్ కార్యక్రమంలో విడుదల చేశారు. ఆ ఫంక్షన్ కి వచ్చి మొదటి **విజన్ –2020** కాపీని తీసుకోవలసిందిగా చంద్రబాబు నాకు ఫోన్ చేయించాడు. నాకు వేరే కార్యక్రమాలవల్ల నేను రాలేనని చెబితే, చంద్రబాబే స్వయంగా ఫోన్ చేసి మీరు రావాలి, మళ్ళీ మీరు వెంటనే వెళ్ళిపోవచ్చు రండి అని అడగడం జరిగింది. అయినా ఆ కార్యక్రమానికి నేను రాలేదు. నాకు ఆ విజన్–2020 కాపీ ఎవ్వరూ ఇవ్వలేదు. దానిని గురించి నాతో ఎప్పుడూ చర్చించలేదు. ఆ రిపోర్టుని మెకంజీ వాళ్ళ ద్వారా తయారు చేసిన విధానాన్ని నేను వ్యతిరేకించాను అనే విషయం చంద్రబాబు మరచిపోలేదు. అందుకేనేమో ఈ విజన్ 2020లో నా పాత్ర, కృషిని గురించి ఎక్కడా ప్రస్తావనకూడా చేయలేదు. అధికారులు కూడా "ఇది విదేశీ నిపుణులు Foreign experts" తయారు చేశారని చెప్పుకోవటంతో సంతోషపడ్డారు. మెకంజీ వాళ్ళు కూడా ఆ రిపోర్టులో ఎక్కడో చిన్నగా ప్రస్తావించారు. నేను మొదటినుంచీ ఏమీ ఆశించలేదు. కాబట్టి ఆ విషయాలు మరచిపోయా. 6–7 నెలల సమయమే గడవటమే కాక, ఢిల్లీలో నా ఇతర కార్యక్రమాలకి ఎన్నో రకాలుగా అంతరాయం కలిగింది. ఆ ప్రస్తావన ఎక్కడా నేను చేయలా.

ఇవి ముఖ్యమైన సందర్భాలు ఇంకా ఎన్నో డాక్టర్ సాంబశివరావు, ఐ.ఏ.ఎస్., నెల్లూరు కలెక్టరుగా చేసి చంద్రబాబు ఆఫీస్ లో అధికారి అప్పుడప్పుడు నా దగ్గరకు వచ్చి కొత్త సలహాలు, ఆలోచనలని గురించి తెలుసుకుంటూ వుండేవాడు.

ఈ జ్ఞాపకాలను ఉదాహరణగా మాత్రమే ప్రస్తావిస్తున్నా. మొదటి 10–15 సంవత్సరాలలో చంద్రబాబు ఆలోచనలు, ప్రాముఖ్యతలు, పద్ధతులు, పట్టదలతో ఏ

విధంగా భవిష్యత్ మార్గాన్ని, ప్రజా సంబంధాలను దృష్టిలో పెట్టుకుని, నాయకుడిగా బలపడ్డాడో తెలుస్తుంది. ఈ విధంగా తన శక్తి సామర్థ్యాలని పెంచుకోవటం జరిగింది. ఇవి నాకు తెలిసిన సందర్భాలు మాత్రమే.

రాజకీయాల్లో రాణించటం

రాజకీయాల్లో రాణించడం అంటే చాలా మంది దృష్టిలో కుట్రలు, కుతంత్రాలు, మందీ మార్బలమే కాక డబ్బు దస్కమ్ తోపాటు స్వార్థపూరిత వ్యవహార ధోరణి ఎక్కువ. రేపు గురించి కాదు, ఈ రోజు గురించే ఆలోచించేవాళ్ళే ఎక్కువ.

ఎంతసేపటికీ ఇంకొకళ్ళు, ఇతరులు మారాలనేదే గాని తన్ను తాను తీర్చిదిద్దుకోవాలనే ఉద్దేశం వుండదు, పద్ధతులు కూడా తెలియవు. అప్పటికప్పుడే తాత్కాలిక ధోరణులే ఎక్కువ. వీటన్నింటిని అధిగమించి ఆలోచించకల్గినప్పుడే రాజకీయాల్లో నాయకుడిగా మనుగడ, ప్రత్యేకత. నేర్చుకునే ఓపిక, ఎవరి నుంచి అయినా దిద్దుకునే ధోరణి, ముందు తన శక్తియుక్తులను సామర్థ్యాలను పెంచుకోవాలి. అందుకు ప్రయత్నించాలి. అందుకు కొన్ని పద్ధతులు గ్రహించాలి. ఇవి తెలుసుకుని ప్రయత్నించినప్పుడే నాయకుడిగా పెరుగుదల, అప్పుడే ఒడిదొడుకులను తట్టుకునేది, దాటకల్గేది విజయవంతం అని తెలుసుకోవటం.

పార్టీలోకి పరీక్షల తర్వాతే...

ముఖ్యమంత్రి ఎన్టీఆర్కి ఆలోచనే కాదు, మార్గాలు కూడా తెలుసు. చంద్రబాబుని పార్టీలోకి తీసుకోగానే తెలుగుదేశం కార్యాలయ వ్యవహారాలే కాక, **కర్షక పరిషత్** అనే అద్భుతసంస్థని ఆ టైములో మొదలుపెట్టి దాని బాధ్యతలు చంద్రబాబుకి అప్పచెప్పడం జరిగింది. చంద్రబాబు ఆ వ్యవస్థ ద్వారా రైతులు, రైతు కుటుంబాల గ్రామీణ సౌభాగ్యానికి కార్యక్రమాలు చేపట్టారు.

ముఖ్యంగా నాకు నచ్చింది మహిళా సహకార పాల సంస్థ, గ్రామాల్లో పాడితో మొదలు పెట్టటం. మహిళల ఆత్మాభిమానానికి సంబంధించిన కార్యక్రమం **డ్వాక్రా స్కీము** ఆ తర్వాత ఆ అనుభవం. దేశంలోనే ఒక నూతన ఆలోచనగా ప్రారంభించారు. ఇప్పటికీ కొనసాగుతోంది దేశంలో. అయితే కర్షక పరిషత్ గురించి ఆ తర్వాత వినలేదు.

ఆ తర్వాత 1997లో **జన్మభూమి** అనే ఒక మంచి కార్యక్రమాన్ని (సౌత్ కొరియా నుంచి తెలుసుకున్న దానిని) చేపట్టి గ్రామాల్లో ఎన్నో రోడ్లు, బిల్డింగ్ ల నిర్మాణం చేపట్టారు. ముఖ్యంగా **పుట్టిపెరిగిన గ్రామం**, **చదువుకున్న పాఠశాల** ఇట్లాంటి ఆలోచనలతో స్థానిక ప్రజలనేకాక ప్రవాసాంధ్రులను కూడా ఉత్తేజ పరచి వాళ్ళు అట్లాంటి కార్యక్రమాల నిర్వహణలో బాధ్యత, ఆ తర్వాత కూడా **రైతుబజారు** లాంటి కార్యక్రమాలు తీసుకుంటేనే వాటి ఉపయోగం అని భావించారు. ఆ తర్వాత అవగాహనతో రైతులను ప్రోత్సహించటానికి కూడా ఆ ఆలోచన కొంత తోడ్పడిందని చెప్పాలి. అయితే జన్మభూమిలో పార్టీ కార్యకర్తల ప్రభావం కొన్నిచోట్ల అతిగా ఉండటం వల్ల ఆ కార్యక్రమానికి రావలసిన ప్రతిభ, ప్రతిధ్వని రాలేదేమో అనిపిస్తుంది నాకు. ఆ విషయం చంద్రబాబుకి తెలియజేయడం కూడా జరిగింది.

ఈ శక్తి,సామర్థ్యాలలో ముఖ్యమైనది తన్నుతాను ఇతరులకన్నా మిన్నగా మలచుకోవాలి అనేది గ్రహించటం. ఇది చంద్రబాబు రాజకీయాల్లో మొదటి ఎన్నికల సందర్భంలోనే గ్రహించినట్టు తెలుస్తుంది. అంటే 1975–77లోనే. 45 సంవత్సరాల కిందట ఆదర్శనాయకుడిగా తయారవ్వడానికి ఎంతో అవకాశం, మరి దానిని ఉపయోగించు కోవటం వల్లనే గదా. ప్రత్యేకతని ప్రదర్శించటానికి నైపుణ్యాన్ని పెంపొందించుకోవటం మంచి, చెడులు సమీక్షించుకోవటానికి మార్గాలు ఏర్పరచుకోవటం లక్ష్యాన్ని సాధించే ప్రయాణానికి ముఖ్యం అనేవే ఆయనకు ! ప్రత్యేకతని తీసుకువచ్చిన మార్గాలు.

ప్రజల మధ్య రాజకీయజీవితం ఎంతమంది నాయకుల విషయంలో నిరంతరం అని చెప్పవచ్చు? ప్రజలతో, ప్రజల మధ్య, ప్రజలకోసం, ప్రజల గురించే ప్రజల భవిష్యత్ బాధ్యతగా భావించి జీవించే నాయకులు దేశరాజకీయాల్లో ఎంతమంది? వేళ్లమీద లెక్కవేయవచ్చునేమో చంద్రబాబు వాళ్లలో నిలిచిపోతాడు. అధికారంలో వున్నా, లేకపోయినా అదే గదా తేడా. కొట్టొచ్చే విధంగా కనపడేది తెలుసుకోవాలనే కుతూహలతే కాకుండా ప్రజలని చూడాలి, కలవాలి, ప్రజల్లోకి వెళ్ళాలి అనేదానికి చంద్రబాబు ఎప్పుడూ సిద్ధం అనేది ఇన్ని సంవత్సరాల తర్వాత, గెలుపు ఓటముల తర్వాత కూడా అదే దూకుడు అనవచ్చు.

"సమయం తెలియని నాయకుడు" అని చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పుడు ఆయన్ని గురించి ఒక సినిమా కవి వర్ణించాడు. అయితే అప్పుడు అది ఎవరికీ అర్థం కాలేదేమో. అదే ఆయన రాజకీయ జీవితంలో ప్రజాసేవలో ఎంతగానో సహాయపడిందని చెప్పవచ్చు. రోజుకు 24 గంటలు కాదు 30 గంటలు వున్నట్లు పనిచేయటం– అది క్రమశిక్షణ అలవాటే కాదు, జీవన విధానంగా వుండటం. టైమ్ మేనేజిమెంట్ స్వతహాగా చేసుకోవడం నుంచే చంద్రబాబు అన్ని కార్యక్రమాలు నిర్వహించకల్గుతున్నారు రోజు వారీగా. ఎన్నో సంవత్సరాల నుంచి, దానికి ఎన్టీఆర్ గారికి చంద్రబాబు రుణపడి వుండవలసిందే.

మనస్సుని ప్రశాంతంగా ఉంచటం వినటానికి, చదవటానికే కాదు ఆలోచించటానికి కూడా అని గ్రహించాడు. మొదటి 20 సంవత్సరాలలోనే బ్రహ్మకుమారి సమాజ శిక్షణలో పడడం ఆయనకు ఒక అదృష్టంగా చెప్పవచ్చు. అందుకే ఆయన బ్రహ్మకుమారి సంస్థకి హైదరాబాదులో సంస్థలు కావడానికి ఎప్పుడో తోడ్పడ్డారు.

Legendary N.T.R. ప్రఖ్యాత నాయకుడు నందమూరి


1983 లో ఎన్టీఆర్ గారు రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, దేశం లోనే, ఈ రోజుకీ, ఒక అద్భుత నాయకుడిగా నిలిచిపోయారు. అధికార వికేంద్రీకరణ, పరిపాలనా విధానాలలో **ప్రజల నాడి** గ్రహించే తీరులో కూడా ఆయన ఒక ప్రత్యేకతను చూపించారు. ఇవన్నీ కూడా చంద్రబాబు నాయకుడిగా ఆరితేరటానికి తోడ్పడ్డాయి.

ఎన్టీఆర్ గారు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మూడుసార్లు కలిశాను. మొదటిసారి ఆయనకు సెక్రటరీగా వున్న యుగంధర్ గారు 'ఎన్టీ ఆర్ని కలిశారా?' అని అడిగారు.'కలవలేదు' అంటే, 'అయితే రేపు ప్రొద్దునే ఆఫీసుకు రండి.' అన్నారు. ఎన్.టి.ఆర్. గారి ఆఫీసులోకి వెళ్ళగానే ఆయన రెండే రెండు ప్రశ్నలు. మొదటిది అదిలాబాదు, శ్రీకాకుళం జిల్లాలు కూడా మిగిలిన జిల్లాలతోపాటు అభివృద్ధిలోకి రావాలి. ఇది ఇప్పుడు నా ముందున్న సమస్య. మీరు ఏదైనా స్టడీ చేశారా అని అడగటం. మీ సలహాలు చెప్పండి అని ఇంకొకళ్ళతో మాటల్లోకి వెళ్ళారు. అదీ ఎన్టీఆర్. To the point.

ఎన్టీఆర్ గారు పార్టీ పెట్టపోతున్నారనే విషయం అప్పుడు 1982-83లో అందరు మాట్లాడుతున్న విషయం. **నిజంగానా!** అని ప్రధాన మంత్రిగారు కూడా రూఢి చేసుకోదలిచారు. ఒకరోజు ఆర్కే ధావన్ ఫోన్ చేసి మేడంని కలవండీ అని చెప్పారు. ఎందుకో చెప్పలా. మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు పార్లమెంటులో ఆమెను కలిశా. ఎన్టీఆర్గారు తెలుసా? అన్నారు. ప్రత్యేకంగా తెలియదు. అన్నా. ఆయన పార్టీ పెడతారట గదా! అని వింటున్నాము గదా! ఎప్పుడు పెడుతున్నారు? దాని ప్రభావం ఎట్లా వుంటుంది? తర్వాత ప్రశ్న. అదే రోజు సాయంత్రానికే హైదరాబాదు చేరుకుని ఎన్టీఆర్ గారిని కలవడానికి ప్రయత్నించా. వీరబ్రహ్మంగారి ఫిల్మ్ షూటింగ్లో వున్నారు, ఎవరినీ కలవరు అని చెప్పారు.

అప్పుడు గుడివాడ పాత పరిచయస్తుడు జనతా కోటేశ్వరరావుగారిని కోరా. ఆయనా మొదట అదే సమాధానం. ఆయనను మళ్ళీ అడగడంతో ప్రయత్నిస్తాను, రేపు ఉదయం రమ్మన్నారు. మర్నాడు ఉదయం ఫోను చేసి '11 గంటలకి చార్మినార్ చౌరాస్తాలో స్టూడియోకి వెళ్ళండి, షూటింగ్ విరామ సమయంలో కలవటానికి ప్రయత్నిస్తానని చెప్పారు.' ఎన్టీఆర్గారి ఆఫీసు శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానాన్ని గుర్తుకు తెచ్చే విధంగా కళాఖండాలతో నిండి ఎంతో హుందాగా వుంది. నన్ను ప్రభావితం చేసింది. 15 నిమిషాల తర్వాత షూటింగ్ మేకప్ డ్రెస్ లోనే వచ్చి, "తమరి"ని 15 నిమిషాలు వెయిట్ చేయించాను'' అని వాపోయి. నన్ను ఢిల్లీలో ఏమి చేస్తారో జనతా కోటేశ్వరరావుగారు చెప్పినదాని మీద ప్రశ్నలు వేసి, తను పార్టీ ఎప్పుడు పెట్టబోతున్నట్టు, ఎందుకు పెడుతున్నట్టు నన్ను ఢిల్లీలో వున్న తెలుగు ప్రముఖులకు చెప్పి వాళ్లని పార్టీలో చేరమని తన తరపున కోరమని 40 నిమిషాల్లో వివరించారు. నేను ఎన్టీఆర్ గారు కనుక రాజకీయాల్లోకి వస్తే ఆయన ఆలోచన, ఆదుర్దా, వ్యక్తపరచిన తీరు నన్ను మైమరపించింది. దేశంలో ఏ నాయకుడూ ఆయనకు సరితూగడనీ నిర్ణయానికి వచ్చా.. ఆయనది తట్టుకోలేని వ్యక్తిత్వమని నిర్ణయానికి వెంటనే రావటమేగాక అదే విషయాన్ని అడిగినవాళ్ళందరికి తెలియజేశా. అట్లాగే తెలుగు వాళ్ళందరికి ఆయన ఆహ్వానంగా కూడా చెప్పా. ఢిల్లీకి రాగానే ఆ విషయాన్ని మొదటిగా చెప్పింది పి. ఉపేంద్రకి. ఆయన వైష్ణవదేవి యాత్రకి కూతురు పద్మతో వెళ్ళి వచ్చి రైల్వే ఉద్యోగం రాజీనామా చేసి, హైదరాబాదు వచ్చి, వెంటనే ఎన్టీఆర్ని కలసి పార్టీలో చేరారు. అందుకేనేమో నేను ప్రభుత్వంలో ఏ ఉద్యోగంలో లేకపోయినా Intelligence Chief T.V. రాజేశ్వర్ నా మీద నిఘా పెట్టారని అనిపించింది. ఆయన నన్ను కలిస్తే ఎన్టీ ఆర్ని గురించి అదే అభిప్రాయం చెప్పాను. రాజేశ్వర్ గారికి ఆ తర్వాత నేనంటే నిర్మొహమాటంగా చెప్పానని గౌరవం. చాలా స్నేహంగా వుండేవాడు.





9-1-1983 తెలుగుదేశం ప్రారంభోత్సవము సందర్భం
లాల్ బహదూర్ స్టేడియం హైదరాబాద్

చంద్రబాబు గురించి అభిప్రాయాలు మారాయా? మారాలిగా...

ఢిల్లీలో నాకు చాలా పరిచయం వున్న పాతమిత్రులు, అనేక మినిస్ట్రీలలో సెక్రటరీ స్థాయిల్లో పనిచేసిన ఆమెను ఒకసారి చంద్రబాబును గురించి అభిప్రాయం అడిగాను. ఆమె Communication Ministry లో, PMO లో, TRAI లో కూడా పనిచేసింది. ఆవిడకి నాకు చంద్రబాబుతో పరిచయం ఉన్న విషయం తెలియదు.

"చంద్రబాబు అంటే నాకు ఆశ్చర్యం! ఎందుకంటే ఆయన Comunicator కాదు, ఆయన చెప్పేది పెద్దగా అర్థం కాదు. charismatic కూడా కాదు. ఎట్లా ఇంతకాలం రాజకీయాల్లో మనుగడ వచ్చింది!!" అని క్లుప్తంగా చెప్పింది. బహుశా చాలామంది అధికారుల దృష్టిలో అప్పుడు చంద్రబాబు అంటే దూరాన ఉన్నవారికి, ప్రత్యక్ష అనుభవం లేనివాళ్ళకూ అదే అభిప్రాయం.

అది ఢిల్లీలో. అక్కడి నుంచి హైదరాబాదు నాల్గు రోజుల కోసం వచ్చినపుడు అదే విషయం మీద అక్కడి కంటి డాక్టర్తో మాట్లాడటం జరిగింది. “చూశారుగా, చంద్రబాబు ఎఫెక్ట్ .ఈ తరంవారికి ఆయన్ని గురించి ఏమీ తెలియదనుకుంటున్న సమయంలో, ఉవ్వెత్తున లేచి, ఆయన చేసిన కృషికి రుజువు మేమే అని బయటకి వచ్చి మరీ చాటి చెప్తారు.

ఆ తర్వాత అదే వారంలో విజయవాడ వచ్చినపుడు ఒక షాపు యజమాని తో మాట్లాడితే "చంద్రబాబు వుంటే మా వ్యాపారం ఎంతో ముందంజలో వుండేది. అదే కదా ఆయన సంపద సృష్టి అంటే. అప్పుడే కదా?" అని వాపోయాడు.

అదే రోజు మా ఊరు చేరుకున్నా. ఒక మధ్యతరగతి రైతుని ఆస్తి విషయం కదిలిస్తే, “మా గోడు ఎవరికీ అర్థం అయినట్టు లేదు.

ఎవరితో చెప్పుకోం మా బాధలు? మధ్య దళారీలుగా వ్యవహరించేవాళ్ళు పెరిగారే గాని తగ్గలా. ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీదనే అంతా.” అన్నాడు.

విచిత్రం ఏమిటంటే ఆంధ్రప్రదేశ్ ల చంద్రబాబు మారడా? అనే ప్రశ్న ఈ మధ్య ఎక్కువ మంది నుంచి వినబడుతుంది. ‘కోపతాపాల రాజ్యంలో కూడా ఆయన ఇంకా అట్లాగే వున్నాడు’ అని వాళ్ళ ఉద్దేశ్యం. నష్టపోయేది **ప్రజలేగా** అనో, **ప్రజలే లే** అనే విధంగానో. మరి భవిష్యత్ మాటేమిటి?

1994 లో ఆయన ఆర్థికమంత్రిగా ఢిల్లీలో విజ్ఞానభవన్లో ఆర్థిక మంత్రుల సమావేశంలో Presentation ఎట్లా ఇవ్వవచ్చో, ముఖ్యంగా Oration, diction సరిగ్గా లేకపోయినప్పుడు, తరువాత చంద్రబాబు ప్రత్యక్ష సమావేశాలలో ఏ విధంగా Presentation ల ద్వారా ఎట్లా తరువాత సంవత్సరాలలో తనకు తానుగా అభివృద్ధి చెందాడో చెప్పుకోదగ్గ విషయమే. మరే రాజకీయ నాయకుడి విషయంలో అట్లాంటి అభివృద్ధి నేను నా అనుభవంలో చూడలేదు. ఈ మధ్యకాలంలో నరేంద్రమోడీ గారికి ఎవరూ ఈ విషయంలో సరిలేరు.

నాకు కొన్ని వారాలుగా ఎన్టీఆర్ గారి "బోల్తా కొట్టిందిలే బుల్బుల్ పిట్ట" అనే సినిమా పాట గుర్తు వస్తోంది. ఎందుకని? ఏ సందర్భంగా? దేశానికే దిక్సూచిగా రాజకీయాల్లో పేరొంది ఒక్కసారిగా స్థానిక ప్రత్యర్థుల గాడిలో పడ్డారా అన్న విధంగా వుంది. విచ్చలవిడిగా వాగ్దానాలు తనే చెప్పటం మొదలుపెట్టితే, విధానాల్లో మార్పు ఎట్లా వస్తుంది? భవిష్యత్ దృష్టి ఏమవుతుంది? అదీ ప్రశ్నించే అలవాటుకు బదులుగా మరి మార్గాలే వేరవ్వాలిగా!

టైమ్ మేనేజిమెంటు



రాజకీయ నాయకులు ఎప్పుడూ టైమ్ కి రారు, రాలేరు అనేది ప్రజల అనుభవం. చాలా వరకూ నాయకుల తీరు అదే. ఎంత ఆలస్యం చేస్తే అంత గొప్ప అనే నాయకులు కూడా చాలామంది ఈ రోజుకీ ఉన్నారు, అదే సూత్రాన్ని పాటిస్తారు కూడా. క్రమశిక్షణకి ప్రథమ సూత్రం **టైమ్.** ''టైమ్ మేనేజిమెంటు ద్వారా ప్రజలకు ఆదర్శంగా ఉండవచ్చు. పిల్లలకు నేర్పడానికి అదొక అవకాశం'' అని ఏ కొద్దిమంది నాయకులో అనుకుంటారు. చంద్రబాబు చాలా వరకూ ప్రయత్నిస్తాడు కూడా. ఆయనతో నా రెండు అనుభవాలు గుర్తుకొచ్చేవి. ఒకటి ఆయనతోపాటు హెలికాప్టర్లో కోనసీమ తుపాన్ సందర్భ పర్యటన. ఆ పర్యటన చాలా వరకు బస్సులోనే 12 గంటలు. నిర్ణయించుకున్న సమయానికి ప్రతిచోట, ఆయన చూసుకోవడం గమనించా. అయితే ఏ కార్యక్రమాన్ని రద్దు చేయలేదు. అనుకున్న గ్రామాలన్నీ, అందరినీ పరామర్శించటం కూడా గమనించా. ఇంకోసారి విజయవాడ స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో మనోరమ – అర్జునరావుల 100 సంవత్సరాల జన్మదిన కార్యక్రమం జరపాలని మా నాన్న కోర్కె. ఆయన అది జరపకుండానే చనిపోతే ఆ కార్యక్రమాన్ని నేను విజయవాడలో జరిపాను. *(మనోరమ గారు ప్రముఖ హేతువాది '**గోరా**' గారి పెద్దమ్మాయి. అర్జునరావు గోరా గారి శిష్యుడు. వీరిద్దరూ వివాహం చేసుకోవటానికి నిర్ణయించుకున్నారు. పెద్దలు గాంధీజీకి ఈ విషయం తెలిపి ఆమోదం అడిగారు. నేను వారిద్దరితో మాట్లాడకుండా ఆమోదం చెప్పను అని బాపూజీ అన్నాడు. తరువాత వారు గాంధీజీని కలిసి, మాట్లాడిన పిమ్మట, ఆమోదం తెలపటమే కాక ఈ వివాహం*


దేశంలో తొలిసారిగా జరిగే బ్రాహ్మణ, బ్రాహ్మణేతరుల వివాహం కనుక బాపూ స్వయంగా జరపాలనుకున్నారు. కానీ దురదృష్టవశాత్తు బాపూ హఠాత్ మరణం జరిగింది. అర్జునరావు గారు 106 వ యేట కన్ను మూశారు. మనోరమ గారు ప్రస్తుతం విజయవాడలో ఉన్నారు.)

ఆ సందర్భంగా 25 మంది స్వాతంత్ర్య సమరయోధులకి సన్మానం చేసే కార్యక్రమానికి రావలసిందిగా చంద్రబాబుగారిని ఢిల్లీ నుంచి ఈ మెయిల్ ద్వారా ఆహ్వానించాను. సమాధానం లేదు. అయితే అది ఆయన మీద ఆధారపడిన కార్యక్రమం కాదు. విజయవాడ వచ్చిన తర్వాత ఫోన్ చేస్తే ఆయన చాలా బిజీగా వున్నారనీ, ఈ కార్యక్రమం ఆయన దినచర్యలో లేదు అని చెప్పారు. నేను 'ఆయనకి చెప్పండి' అని ఫోన్ పెట్టేశా. సాయంత్రం కార్యక్రమం మొదలవుతూ వుండగా చంద్రబాబుగారు ప్రత్యక్షమై 10 నిమిషాలు వుంటానని ముందే చెప్పినా, 55 నిమిషాలు వుండి, దాదాపు 25 మంది స్వాతంత్ర్య సమరయోధులందరినీ పలకరించి, సమరయోధుల పాత్రను గురించి అద్భుతంగా మాట్లాడి, 'అర్జునరావు–మనోరమ' గారి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఆ కార్యక్రమానికి వచ్చినందుకు సంతోషమని చెప్పి వేరే కార్యక్రమం వల్ల వెళ్లవలసి వస్తోందని చెప్పి వెళ్ళారు. ఆ రోజు వచ్చిన స్వాతంత్ర్య సమరయోధులు మూర్తిరాజుగారితోపాటు ఇత ముఖ్యులు ఆ తర్వాత కొద్ది నెలలకే పరమపదించారు. చంద్రబాబు ఆ స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు తెలుసుకుని వాళ్ళకి ప్రత్యేక శ్రద్ధాంజలి ఘటించారు.

ఒకసారి ఇతరుల సమయానికి కూడా అంతే విలువ ఇచ్చి కార్యకర్తల, ప్రజల టైమ్ ఒక నాయకుడి కోసం ఎంత వృథా చేస్తారో, గమనించి, ధ్యాసలో పెట్టుకుని మెలగినప్పుడే తేడా అని చెబితే ఆయన తన పర్యటనలో కొన్ని మార్పులు సూచించారు. ఆయన దినచర్య తీరు తెలుసుకోవలసిందే! నేర్చుకోవలసిందే!! **కాలం** విలువ, దానిని ఎట్లా సద్వినియోగపరచుకోవాలో ఈ నాయకుడిని చూసి నేర్చుకోవచ్చు.

30 రోజుల్లో విచిత్రం

1984 ఆగస్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జరిగిన రాజకీయ సంక్షోభంలో కొన్ని అద్భుతాలు జరిగాయి. ఎన్నో పాఠాలు కూడా నేర్చుకున్నాం. సక్రమంగా ఎన్నికైన ఒక రాజకీయ పార్టీ నాయకుడిని అడ్డగోలుగా తొలగించి, ఒక తోలుబొమ్మని నిలబెట్టడం జరిగింది. ఢిల్లీలో, హైదరాబాదులో వేరు, వేరు పార్టీలు అధికారంలో ఉండటమేగాక ఆంధ్రప్రదేశ్లో ఒక గొప్ప నాయకుడి పార్టీ తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావటమే గాక ఢిల్లీ నాయకుల్ని ఒక ఊపు ఊపి, అదరగొట్టడం అతిశయోక్తి కాదు. అప్పుడు చంద్రబాబు ఆధ్వర్యంలో 30 రోజుల్లో ఆ ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పదవిలోకి తీసుకువచ్చి, దానికి కారణం అయిన రాష్ట్ర గవర్నర్ కు బుద్ధి చెప్పటం జరిగింది. అది అంతకు ముందెప్పుడూ ఊహించని విధంగా దేశరాజకీయాల్లో జరిగిన ఒక అద్భుతం. ఆ తంతులో చంద్రబాబు, ఉపేంద్ర ఇద్దరూ కలిసి హైదరాబాదు, ఢిల్లీలో రాష్ట్రపతి, మీడియాతో సమర్ధవంతంగా వ్యవహరించిన తీరు గుర్తుచేసుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఆ ఇద్దరూ అప్పడు నా స్నేహితులు. ఇద్దరూ ఢిల్లీలో నాతో ఎప్పటికప్పుడు ఎన్టీఆర్తో ఢిల్లీకి వచ్చే రైలు దగ్గర నుంచి ఆయన్ని 'ఆంధ్ర ఎడ్యుకేషన్ క్యాంపస్' లో వుంచాలనే కార్యక్రమాల నిర్వహణలో నాతో సంప్రదింపులు జరుపుతూనే వున్నారు. ఎన్టీఆర్ని ఆరోగ్యరీత్యా నేను, ఉపేంద్ర కలిసి ఢిల్లీ సౌత్ ఎక్స్ టెన్షన్ లో ఉన్న డాక్టర్ జైన్ హాస్పిటల్కి హుటాహుటిన తరలించాం. రాష్ట్రపతితో అందరి చేత ప్రదర్శనల వ్యవహారాల విషయంతోసహా చూశాం. 'కలసి పనిచేస్తే, మరీ ముఖ్యంగా రాజకీయాల్లో కూడా, సంక్షోభంలోంచి విజయవంతంగా రావటానికి సాధించలేనిదంటూ వుంటుందా?'



విజన్ – 2020 దేశంలో మొదటి ప్రయత్నం

విజన్ అనేది ఒక ఆలోచనే కాదు. **ముందుచూపు**. రేపటిని గురించి ఆలోచించటమేకాదు, ఈ రోజు ఏ చర్యలు, నిర్ణయాలు తీసుకుంటే, ఆ విజన్ ని చేరుకోగలమని తెలుసుకోవటం. అయితే గెలుపు ఓటమిలతో ముడిపడిన రాజకీయ నాయకుల ఆలోచనలు ఎంతసేపటికీ ఇప్పుడు, ఈ ఎన్నికని గురించేగా! ఎట్లాగైనా గెలుపు సొంతం చేసుకోవాలనేగా!! అంటే విజన్ ఎవ్వడికి కావాలి అనే భావన. ఇదొక విచిత్ర విషయం, ప్రతి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల భవిష్యత్ గురించి తహతహలాడినప్పుడు మరి ఎందుకు రాబోయే సంవత్సరాల గురించి పట్టించుకోరు. అదే చంద్రబాబు విజన్ – 2020. ఈ ఆలోచన కొంత చర్చనీయాంశం అయినా ఆయనకి ఒక ప్రత్యేక గుర్తింపు రావటానికి, నాల్గు కాలాలపాటు గుర్తుంచుకోటానికి కారణమైంది.

నాయకుడిగా చంద్రబాబు ప్రత్యేకత ఏమిటంటే ఒక మంచి ఆలోచనని వెంటనే గ్రహించటమేగాక, దానిని ప్రభుత్వ కార్యక్రమం చేయటం, అధికారులందరినీ ఆ ఆలోచనలో సమాయత్తం చేయటం. ఢిల్లీలో నేనున్న 60 సంవత్సరాలలో ఏ నాయకుడూ అంత త్వరగా కొత్త ఆలోచనని తీసుకోలేదు. ఇందిరాగాంధీ కూడా **'సోషల్ ఆడిట్'** ప్రాముఖ్యతని నేను ప్రస్తావించినప్పుడు

వెంటనే ఆమోదించినా, కేబినెట్ సెక్రటరీని ఒప్పించ లేకపోయింది. అధికారులు వాళ్ళ అధికారానికి అవరోధంగా భావించటం జరిగింది. ఆ తర్వాత పది సంవత్సరాలకి ఒక మంత్రి (రాజేష్ పైలట్) నచ్చ చెప్పితేగాని **సోషల్ ఆడిట్** దేశంలో ఒక ముఖ్య వనరు, ప్రణాళిక కాలేదు? అదీ నాల్గు సంవత్సరాలపాటే. విజన్ – 2020 విషయంలో అట్లా జరగలా. అదే చంద్రబాబు ప్రత్యేకత. ప్రభుత్వంలో కూడా ఆ దృక్పథం తీసుకురాగలిగారు.

ఓఆర్టీజీలో 1985 లో ఉండగా చేసిన పరిశోధన ఉద్దేశం– వివిధ ముఖ్యరంగాల్లో 2020 లో దేశపరిస్థితి ఏ విధంగా వుంటుందో తెలుసుకోవటం. ముఖ్యంగా ఆర్థికాభివృద్ధి, ఉద్యోగఅవకాశాలు ఎలా ఉండవచ్చు? ఆర్థిక వ్యత్యాసాలు ఏమైనా తగ్గుతాయా? అందుకు ఏ ప్రయత్నాలు కావాలి? జనాభా, పట్టణాల స్థితిగతులు, ఇంకా అనేక రంగాల్లో దేశం ఏ విధంగా ఉండబోతోంది అనే విషయాలు తెలుసుకోవటం. 1986 లో వీటన్నిటితో నేను **ఇండియా–2021** అని ఒక పుస్తకం తీసుకువచ్చాను. అప్పటి దేశ ప్రణాళికాశాఖ మంత్రి మాధవసింగ్ సోలంకి గారు ఆ పుస్తకాన్ని ఆవిష్కరించి, అప్పటి ప్లానింగ్ కమిషన్ కు కూడా అట్లాంటి అధ్యయనాలు (స్టడీస్) చేయమని సలహా ఇచ్చారు. ఆ తర్వాత ఆ పుస్తకాన్ని ఉదహరిస్తూ జార్జ్ ఫెర్నాండెజ్ గారు పార్లమెంటులో విశ్వాసరాహిత్య ప్రతిపాదనలో ప్రస్తావించి 2020 లో కూడా దేశపరిస్థితి మెరుగు అయ్యే సూచనలని గురించి మాట్లాడారు. ఆ తర్వాత 4–5 సంవత్సరాలకు చంద్రబాబుగారు ఢిల్లీ ఏ.పీ. భవన్లో నా చేతిలో వున్న India – 2021 పుస్తకం తీసుకుని తిరగేసి, ‘ మీరు మన రాష్ట్రం గురించి కూడా ఇట్లా చేయకూడదా ’ అన్నారు. అంత త్వరగా ఆయన ఆ పుస్తకం ఏ విధంగా ఉపయోగపడుతుందో గ్రహించటమే కాదు. అయన ఆ సాయంత్రం హైదరాబాదు చేరగానే నాకు ఫోను చేసి ‘ మీరు ప్రొద్దునే హైదరాబాదు రావాలి, మీ పుస్తకం India – 2021 గురించి మా సెక్రటరీలు అందరికీ వివరించి ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక ప్రాజెక్టుగా తీసుకోవాలి. నాకు దూరదర్శన్‌లో ఆ రోజు

10.30 గంటలకు కార్యక్రమం వుంది.'' 'నేను రాలేను' అంటే... ''కాదు, మీరు ఈ రాత్రి చివరి విమానంలో రండి, ఉదయం 5 గంటలకు ముఖ్య సెక్రటరీలు అందరూ వస్తారు. మిమ్ములను తిరిగి న్యూఢిల్లీకి 10.30 గంటలకు వెళ్ళేలా చూసే బాధ్యత నాది.'' అన్నారు. ఎవ్వరైనా నమ్ముతారా అది సాధ్యమని! సరిగ్గా అట్లాగే జరిగింది. అదే టైమ్ ప్రకారం ఆ మీటింగ్ లో **vision 2020** అని అక్కడి వాళ్ళకి చెప్పి దాని సమన్వయకర్త (coordinator) గా నేను వుంటానని చంద్రబాబు ప్రకటించారు. ఆ తర్వాత నేను ఢిల్లీ నుంచి హైదరాబాదు లేక్ వ్యూ అతిధిగృహంలో వుంటూ 12 కమిటీలు వేసి ఒక్కొక్కళ్ళకి భవిష్యత్ ఏ విధంగా ఉండాలో విశదీకరించి, భవిష్యత్ దృశ్యాన్ని కళ్లముందు చూపి, ఏ విధంగా ఏది రాష్ట్రంలో ఎక్కువ మందికి ఉపయోగపడుతుందో" ఏ తీగ లాగితే డొంకంతా కదులుతుందో" అనే పరిశోధనా పద్ధతి గురించి వివరించటం, ఉపోద్ఘాతం వ్రాయడం మొదలుపెట్టిన తర్వాత టైమ్ కి– హార్వర్డు యూనివర్శిటీ నుంచి వచ్చిన ప్రొఫెసర్ క్రిష్ణ అనే వారిని నాతోపాటు విజన్ – 2020 లోకి దించారు. ఆయన కాకతీయ గ్రాండ్ హొటల్లో వుంటూ వచ్చి వెళ్తుండేవాడు. అయితే ఆయనకి నాకు మొదటి చాప్టర్లో ప్రభుత్వ ఉద్యోగుల భారం విషయంలో విభేదాలని చర్చించటం ద్వారా అయిన తర్వాత, చంద్రబాబు గారు ఒక రోజు నన్ను పిలిచి "మనం రేపు బొంబాయి వెళుతున్నాం, ''McKinsgy'' (మెకిన్సీజీ) అనే అమెరికా సంస్థని కలవటానికి మనతోపాటు ఆర్థికమంత్రి అశోక్ గారు కూడా వస్తారు" అని చెప్పారు.

McKinsgy (మెకిన్సీజీ) అప్పుడే మా అభిప్రాయాల్లో తేడాలు మొదలు. నేను (మెకిన్సీజీ) ఇప్పుడు కాదు. ముందు నిజామాబాద్, వరంగల్, విశాఖపట్టణం. విజయవాడ, తిరుపతిలో విజన్–2020 మీద ఓపెన్ హౌస్ సమావేశాలు పెట్టి విస్తృత సంప్రదింపులు అయిన తర్వాత (మెకిన్సీజీ)ని కలుద్దాం అని సలహా ఇచ్చా. అయితే ఆయన అప్పటికే (మెకిన్సీజీ) తో మీటింగ్ నిర్ణయించుకున్నట్లు తెలిసి, మరునాడు వాళ్ళిద్దరితో పాటు బొంబాయికి బయలుదేరాం. అయితే, విమానంలో

వుండగానే చంద్రబాబుగారి తండ్రిగారు మరణించిన వార్త అందటంతో, బొంబాయి విమానాశ్రయం నుంచి చిన్న విమానంలో ఆయన తిరుపతి వెళ్ళిపోతూ నన్ను ఆర్థిక మంత్రి అశోకగజపతి రాజుగారిని మెకిన్సజీ ముంబాయిలో కలసి వెళ్ళమని చెప్పారు. అయితే వాళ్ళని అప్పుడే కలవడం సరికాదని చెప్పి నేను ఢిల్లీకి వెళ్ళిపోయా. ఆ తర్వాత మెకిన్సజీ వాళ్ళు హైదరాబాదు వచ్చి నేను మొదలు పెట్టిన వాటిని కొనసాగించారు.

ఆ తర్వాత ఒక సంవత్సరానికి అనుకుంటా. AP Bhavan – కమిషనర్ గారు ఫోన్ చేసి 'రేపు హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్లో Vision– – 2020 report గవర్నరుగారు release కి చీఫ్ మినిస్టర్ గారు మిమ్మల్ని ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చి మొదటి కాపీని తీసుకోవలసిందిగా కోరారు.' అని ఆహ్వారం అందించారు. తర్వాత ఆయన పీ.ఆర్.ఓ. ఇ. రావు కూడా ఫోన్ చేసి అదే మెసేజ్ ఇచ్చారు. నేను రాలేనని అని చెప్పటంతో, ఆ తర్వాత చంద్రబాబు ఫోన్చేసి రావాలని కోరారు. ఆ రిపోర్టు కాపీని ఆ తర్వాత ఎప్పుడో చూశా. చివరిలో నా పేరు ప్రస్తావించారు. ఆ రిపోర్టులో ఆ తర్వాత విజన్–2020 గురించి నేనెప్పుడూ ఇప్పటి వరకూ ఎక్కడా మాట్లాడలా. ఈ విజన్ కార్యక్రమం మొదట్లో అధికారులకి మర్రి చెన్నారెడ్డి ఇనిస్టిట్యూట్లో రెండు లెక్చర్లు ఇచ్చాను. 12 గ్రూపులకి ఏ గ్రూపుకి సంబంధించిన విషయం మీద భవిష్యత్లో ఏ విధంగా ఊహించాలి. మార్పులు గమనిస్తూ వుండేలా వివరించాను. అయితే ఈ 30 సంవత్సరాలు ఏ యూనివర్శిటీ కూడా భవిష్యత్ మీద ప్రత్యేక Course లు పెట్టలా. సంబంధించిన పరిశోధన కూడా జరిగిన దాఖలాలు లేవు. ఏ నాయకుడూ పట్టించుకున్నట్టు కూడా కనపడదు.

చంద్రబాబు దృష్టి విదేశీ Endorsements and support for AP.' కి మళ్ళిందనే విషయం నేనే గ్రహించలేదనుకోవాలి. నా వాదన ఏమిటంటే AP Vision అనేది రాష్ట్ర ప్రజలతో ముడిపడి ఉండాలి గాని, విదేశీ సంస్థతో కాకూడదు

అని. దాని తయారీలో ముందుగా '**రాష్ట్ర ప్రజలు భాగస్తులు అవ్వాలి, అలా చెయ్యాలి'** అనేదే. విజన్ ఆలోచనను రాష్ట్రంలో అర్థం చేసుకోలేకపోవడానికి, కొంత తెలిసీ తెలియని వ్యతిరేకతకి కారణం అదే. అయితే 20 సంవత్సరాల తర్వాత చంద్రబాబు ఈ విషయాన్ని బాగా గ్రహించినట్టుగా భావించాను. అమరావతి విషయంలో ప్రజానీకాన్ని ఆయన అట్లాంటివి జరగకుండా కొంతవరకు జాగ్రత్త పడినట్లు కనబడుతుంది. అమరావతి ప్రణాళికని తెలియజేయటమేగాక, రైతులను భాగస్వాములు చేయటం, అందుకు చేసిన కొన్ని ప్రయత్నాలు, సంప్రదింపులు, చేసిన విధానం చెప్పుకోదగ్గ విషయాలు. అంతమంది రైతులు కనీవినీ ఎరుగని రీతిలో ముందుకు రావటానికి కూడా కారణం **భవిష్యత్ అంటే అవగాహన**, **ఆలోచన పెరగటమే**. అదే ''చంద్రబాబు Effect'' ప్రభావం.

విజన్-2020, అమరావతి ఆలోచన చంద్రబాబు పదవితో సంబంధం లేకుండా గొప్ప చిహ్నాలుగా మిగిలిపోతాయి. పదవిలో వుంటే వికసించి కొత్త రూపురేఖలు దిద్దుకుంటాయి.

1995-96 లో చంద్రబాబు అమెరికాను ఆకర్షించటానికి(దృష్టి మరల్చటానికి) ప్రయత్నిస్తున్నారని నేను గ్రహించలేకపోయా.

అంటే అమెరికా అధ్యక్షులు, అప్పటి టెక్నాలజీ దిగ్గజం, బిల్ గేట్స్, విజన్-2020 మెకిన్సీజీ సంబంధం ఇందుకు సరిగ్గా సరిపోయిందని చెప్పవచ్చు. అదే ఆ తర్వాత ప్రెసిడెంట్ బిల్ క్లింటన్ (2000) ఆ తర్వాత బిల్ గేట్స్ (2002) హైదరాబాదు రావడానికి కూడా ఉపయోగపడ్డాయని గుర్తు. విజన్ ఒక ముఖ్యమైన టాకింగ్ పాయింటుగా పనికొచ్చింది. అందుకే ఎక్కువ ఉపయోగపడిందా అన్నట్లు మారింది.

మెకిన్సీజీ వారి విజన్-2020 కి ధన్యవాదాలు. చంద్రబాబు పాశ్చాత్య మేడాస్‌తో స్కోర్ చేయడంలో సహాయపడింది "భారతదేశంలోనే కాకుండా

అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో అత్యంత ఆశాజనక స్థానిక నాయకులలో ఒకరు" అని 2001లో ఒరాకిల్ కార్పొరేషన్ ప్రాఫిట్ మాసపత్రిక చంద్రబాబును దాచిన "ఏడు అద్భుతాలలో" ఒకటిగా అభివర్ణించింది ప్రపంచమంతటా.

కుతూహలానికి అంతులేదుగా!

తెలుసుకోవాలి అనే కుతూహలం, కొత్తగా ఎట్లా? ఎక్కడ నుంచి నేర్చుకోవచ్చో? తెలుసుకోవటం. కొత్తగా ఏమి చేయవచ్చు? ఏమి చేయగలం? అనే ఆలోచనలు, ప్రతి అనుభవం, ప్రతి పరిచయం నుంచి నేర్చుకోవచ్చో, తెలుసుకోవలసింది వుంటుంది. ఆ దృష్టి ఉండటం ఒక విశేషమే. చంద్రబాబులో నేను మొదటి నుంచి గ్రహించిన విషయాలు ఇవే. అంతటితో ఆగకుండా ఆ విషయాలు ఎవరికి, ఎట్లా, ఎప్పుడు ఉపయోగపడతాయో కూడా ఆలోచించడం. పార్టీ నాయకుల్లో అరుదుగా ఉండే విషయం. అదే **చంద్రబాబు ప్రత్యేకత** ఆయన వ్యక్తిత్వవికాసానికి కూడా తోడ్పడింది. ప్రశ్నలు అడగటం, అడిగే విధానం,. ఎవరినుంచైనా సరే దానినుంచి గ్రహించటం, స్పష్టత కోసం ప్రయత్నించటం అనే లక్షణాలు కూడా చంద్రబాబునాయుడు నాయకుడు అవ్వటానికి ఎంతోగానో సహకరించాయని నేను గమనించాను. అట్లాగే వినటం, చదవటం, ఆలోచింప చేయటం, విమర్శనాత్మకంగా ఎవరితోనైనా సంభాషించటం, వినమ్రత ఆ కృషికి తోడ్పడ్డాయి. విపులంగా, మొదట్లోనే నేర్చుకున్న అనుభవంతో ఉపాధ్యాయుడిలా, క్లుప్తంగా, సూటిగా ప్రజెంటేషన్లు ఇవ్వటం(పాఠాలు చెప్పటం) కూడా తెల్సుకున్నాడు.

భవిష్యత్ అంటే ఏదో తెలియని విషయాలు, సంబంధంలేని విషయాలు మాట్లాడడం కాదు. ఆ ఆలోచన ఎట్లా చేయాలో తెలిస్తే ఉల్లిపాయ పొరల లాగా పొరలు, పొరలుగా **కొత్త దృక్పథాలు, ఆలోచనలు** వస్తాయని చంద్రబాబు మొదట్లోనే గ్రహించిన విషయం. విజన్-2020 అనే ఆలోచనలు నేను నాటిన

బీజాలే అయినా, వాటికి జీవం పోసి, పెంచి పోషించి, ఆ విజన్ రాష్ట్ర ప్రజలదవ్వాలని తపించిన నాయకుడు చంద్రబాబే.

అందుకు చేయాల్సిన కార్యక్రమాల విషయంలో మా ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు మొలకెత్తాయి. దాంతో నేను ఆ ముఖ్యప్రాజెక్టు నుంచి తప్పుకున్నాను.

దేశ రాజకీయాల్లో – ఢిల్లీలోంచి

ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని పార్టీ వ్యవహారాల్లో ఎప్పుడూ నా జోక్యం, ప్రమేయం లేవు. అట్లాగే చంద్రబాబు పాలనలో కాలంలోగాని, ఆ తర్వాతగాని ఎట్లాంటి పదవుల్లోగాని, సలహాలివ్వడంలోగాని నేను లేను. అంతేగాదు, అప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎంతో పేరు వున్న మా సంస్థను హైదరాబాద్‌లో స్వయంగా మూసివేయడం జరిగింది. అయితే ఒక స్నేహితుడుగా ఎన్నో విధాలుగా సలహాలివ్వటానికి వెనుకాడలేదు. విజన్ –2020 ప్రారంభంలో నా పాత్ర ఏమిటో అప్పటి అధికారులకి మాత్రమే తెలిసిన విషయం. అయితే నేను పూర్తిటైమ్ విజన్–2020 ని లాంచ్ చేసి, ప్రారంభించినా ఏ విధమైన గౌరవ వేతనం లాంటి లాంఛనాల జోలికి పోలేదు.

అప్పుడు చంద్రబాబుతో నా పరిచయాలు రాష్ట్రంలో తెలిసినా, ఎవరికీ తెలియని విషయం– ఆయన ఢిల్లీ కేంద్రంగా దేశ రాజకీయాల్లో పాత్ర పోషించటం. 1996 ఎన్నికల తర్వాతే కాదు, అంతకు ముందు నుంచి. ఆయన మొదటి ఆదర్శ గురువు ప్రొఫెసర్ ఎన్.జి. రంగా గారు(ఆచార్య రంగా). రెండు దశాబ్దాలకు పైగా ముఖ్యమంత్రిగా వున్న జ్యోతిబసుగారు కూడా మరో గురువు. యునైటెడ్ ఫ్రంట్‌కి కన్వీనరుగా 13 పార్టీలతో సాన్నిహిత్యమేగాక ముందే, దేశరాజకీయాల్లోని లోటుపాట్లు, నాయకత్వ లోపాలని విస్తృతంగా చర్చించటమేగాక, ఏ విధమైన పాత్ర ఆయన దేశ రాజకీయాల్లో తీసుకుంటే బాగుంటుందో అని ఆయనతో పలుకోణాలలో చర్చించి, ఆలోచించటమేగాక, ఒక చిన్నపాటి విధాన

నిర్ణయపత్రాన్ని కూడా తయారు చేశాం. దానిని విస్తృతంగా పంపిణీచేసే సమయానికే, రాష్ట్రంలో నాదెండ్ల భాస్కరరావు ప్రయత్నాలు, ఆ తర్వాత ఎన్టీఆర్ అకాల మరణంతో ఆ ఆలోచనలకి స్వస్తి చెప్పినట్లయింది. అయితే చంద్రబాబు దేశ రాజకీయాల్లో ఏ కూటమితో ఉండాలి అనే విషయం మీద అన్ని సందర్భాలలో ఆయనతో లోతుగా చర్చించాను. అది మా ఇద్దరి మధ్య వ్యవహారంగానే ఉండిపోయింది. ముగ్గురు ప్రధాన మంత్రుల నియామకం విషయంలో చంద్రబాబు పాత్ర అందరి మెప్పు పొందింది.

అభివృద్ధి ప్రణాళికలు, పథకాల అమలు, వాటి పర్యవేక్షణలోనేగాక, దేశంలో ఎన్నికల విశ్లేషణ, ఎన్నికల తీరుతెన్నుల విషయంలో ప్రముఖ పాత్రలో, రెండు దశాబ్దాలకుపైగా, ఢిల్లీలో ఉండడమేగాక, విక్రమ్ సారాభాయ్ ప్రారంభించిన దేశంలోనే మొదటి స్వతంత్ర పరిశోధనా సంస్థ డైరెక్టర్ గా అనేక మంది ప్రముఖులతో పరిచయం, కార్యరంగంలో వుండడం వల్ల చంద్రబాబు మొదటి 10–15 సంవత్సరాలలో ఢిల్లీలో అనేక రకాలుగా సంప్రదింపులే గాక, సూచనలు ఇచ్చి ఎన్నో పరిచయాలకి కారణం అయ్యాను. అవన్నీ గుర్తుచేసుకుంటే ఈ పుస్తకం రూపురేఖలే మారతాయి. ఇప్పుడు నా ఉద్దేశం అది కాదు కదా? చంద్రబాబుకి ప్రముఖ పత్రికా విలేకరులను (దిలీప్ పడగాంకర్, సతీష్ జాకబ్, ఎస్. వెంకట నారాయణ లాంటి వాళ్ళని) పరిచయం చేయటమే గాక మొదట యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కావడానికి తోడ్పడ్డాను. మొదటి, దేశం పార్టీలో జేరిన తర్వాత NTR కి ఢిల్లీ Experts తో సమావేశం ఏర్పాటు చేశా. అంతే, ఆ సందర్భంగా చంద్రబాబు, ఉపేంద్రల మధ్య పోరు మొదలైందని తెలుసుకుని, అప్పుడు ఇద్దరూ మిత్రులే. కొంచెం జాగ్రత్త పడవలసి వచ్చింది. అయినా ఎన్నో సందర్భాలలో చంద్రబాబుకు అండదండలుగా నిలిచాను. ఎక్కువగా ఒక critic విమర్శకునిగా, పార్టీలకతీతంగా, 29 పార్లమెంటు సభ్యులు వున్నా వాజపాయ్ ప్రభుత్వంలో చేరకపోవటం అనే నిర్ణయం' చంద్రబాబుని నాయకుడిగానేగాక, భవిష్యత్ ఒక కొత్త ఒరవడికి తోడ్పడించి. తాత్కాలికంగానైనా అప్పుడు.

నాయకుడిని తయారు చేయటంలో

హావభావాలను, మాట తీరును, ఉచ్ఛారణ, కొన్ని పదాలను అనుకరించటం వరకూ నాయకుల ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. ముఖ్యంగా పిల్లలు, యువకులలో చంద్రబాబుని కూడా అదే విధంగా అనుకరించినంతమాత్రాన వాళ్ళు చంద్రబాబు నాయకత్వలక్షణాలు అన్వయించుకో గలరా? ప్రయత్నించినట్టు కూడా కనపడదు. ఆ లక్షణాలు తెలియపోవడం ఒక కారణం. ఈ పుస్తకానికి ఒక ఉద్దేశం ఏమిటంటే దేశంలో కొత్త నాయకత్వం ఎక్కడికక్కడ అవసరం. వ్యక్తిత్వ ప్రభావం వుండడం సహజం. అయితే అక్కడితో సరిపెట్టుకోకూడదు కదా! చంద్రబాబు కన్నా బాగా చేయగల్గాలిగా! అప్పుడే చంద్రబాబు నాయకత్వ ప్రభావం అనగలం. ఎన్టీఆర్ నాయకత్వాన్ని చంద్రబాబు ఏ విధంగా అన్వయించుకుని, అంతకన్నా ముందుకు వెళ్ళకలిగాడు, ఎన్నో విషయాల్లో , అని ఎంతమంది గ్రహించారు? విషయాలమీద, సమస్యా పరిష్కారం విషయంలో ఏమైనా మార్పులు చూస్తున్నామా! నా దృష్టిలో మహా అయితే ఇద్దరు, ముగ్గురు మహిళా మణులూ, ఏడెనిమిది మంది మగవారు నాయకులుగా ఆవిర్భవించారేమో! అనిపిస్తుంది. కేశవ, అనిత, రామ్మోహన్ లాంటి నాయకులు పది మంది వుంటారేమో. చంద్రబాబు నాయకుడయి మార్పుకోసం పడ్డ శ్రమ ఈ 30–40 సంవత్సరాలలో వందమంది పైగా కొత్త నాయకులు జిల్లాల నుంచి కొట్టొచ్చినట్టు కనపడాలి గదా? లోకేష్ విషయంలో చెప్పక తప్పని విషయం. నాయకుడు తనను తాను ఏ విధంగా తీర్చిదిద్దుకొనవచ్చో కొద్దికాలంలోనే, 4–6 సంవత్సరాలలోనే విశేషతగా ప్రదర్శించి ముందుకెళ్ళాడని చెప్పక తప్పదు. చూసే కదా లోకేష్ నాయకుడి కన్నా బాగా మాట్లాడగల్గటమే కాక, సమస్యా పరిష్కార మార్గాన్వేషణ విధానం, విషయాలమీద సంప్రదింపుల వ్యవహారాల్లో అవగాహన, కార్యకర్తల్లో మనోధైర్యం నింపడంత నాయకుడిగా ఎదిగాడు.

క్రమశిక్షణలో కూడా మరి ఇంకా ఎంతమంది విషయంలో పార్టీలో ఆ విధంగా చెప్పుకోగలం. అయితే చంద్రబాబు ఇంకా ఎంతో మందిని ప్రతి గ్రామంలో, జిల్లాలో కొత్తనాయకులని ఆ పరిధిలో ప్రోత్సహించారు. మరి వారికి అవకాశం దొరకటం లేదా? వాళ్ళు తీసుకోవటం లేదా? ప్రోత్సాహం కష్టం అని సరిపెట్టుకోవడమేనా?

తెలుగుదేశంలో మొదట్లోనే ఎన్టీఆర్ గారు ట్రైనింగ్ కార్యక్రమాలు క్రమబద్ధంగా, మనసు పెట్టి తీసుకోవాలని, ఆయనే స్వయంగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించుతూ ఉండేవారు కూడా. చంద్రబాబు కూడా అదే మార్గంలో ప్రయత్నించటమేగాక, టార్గెటు(లక్ష్యం) తో ప్రయత్నించారు కూడా. జిల్లాల నుంచి ఎంతో మంది ట్రైనింగ్ కార్యక్రమాలలో పాల్గొన్నారు కూడా.

చంద్రబాబుకి తెలుసు మొదట్లో గురువు ఆచార్య ఎన్.జి. రంగాగారు ఏ విధంగా శిక్షణా తరగతుల ద్వారా 70 సంవత్సరాల క్రిందట ఒక తరం రాజకీయ నాయకులను కులం, ప్రాంతాలకతీతంగా తయారు చేశారో. వాళ్ళు ఆ తర్వాత ఏ ఏ పార్టీల్లో రాణించినా గాని, కొలికిపూడి శ్రీనివాసరావు, రామారావు, పయ్యావుల కేశవ్ వంటి వాళ్ళతో ఎంతమందికి శిక్షణ ఇచ్చాం అని కాకుండా, నాయకులుగా ఏ విధంగా అవకాశం ఇచ్చాం అని చూడాలి గదా! ముఖ్యంగా కొత్తతరానికి చెందిన వాళ్ళకి. ఈ శిక్షణ ఇప్పుడు ఏ విధంగా ఉండాలనే విషయంపై దృష్టి ఎంత వరకు అనే స్పష్టత కనబడదు. రాజకీయ రూపురేఖలు మార్చే అవకాశాలు, మనుగడ తమ ఆలోచనలు, ఊహలను రేకెత్తించే విధంగా దృష్టి ఉంటేనే ఉపయోగం.

పార్టీలో ట్రైనింగ్ ప్రాముఖ్యత మొదటి నుంచి గుర్తించటమే కాక వాటిని అమలు చేయటంలో కూడా ప్రత్యేకత చూపించారు. వీటికి ఆరంభం ఎన్టీ.ఆర్.దే అయినా ముందుకు తీసుకెళ్ళి శిక్షణా కార్యక్రమాలకి **నిర్ధిష్ట ప్రణాళిక** ఇచ్చి తనే స్వయంగా కృషిచేశారు కూడా 1985-2000 వరకు చంద్రబాబు. ఈ కార్యక్రమాలని మొదలుపెట్టడంలో శ్రీనివాసులు రెడ్డి, కేసీఆర్, జనార్దనే కాక ఇంకా

విశ్వవిద్యాలయాల వివిధ శాఖల నుంచి కూడా కొంత మందికి బాధ్యత అప్పచెప్పి, హైదరాబాదుకే పరిమితం కాకుండా, జిల్లాల్లోకి తీసుకువెళ్ళి అక్కడ కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. అది చంద్రబాబు ఆలోచనే ఇని నాకు తెలుసు. ఇప్పుడు ఈ ప్రాముఖ్యత ఇంకా శిక్షణ ఎక్కువగా, ఎన్నో కొత్త విషయాలకు వ్యాపించటం నేటి అవసరం.



నాయకులు ఎట్లా అయినా అవుతారా?

గ్రహించవలసినవ కొన్ని ముఖ్య లక్షణాలు:

+ సమస్యల మూలాల్లోకి వెళ్ళే ప్రయత్నం చేయాలి, ఎట్లానో తెలుసుకోవాలి

+ వ్యతిరేకత ఎక్కడ, ఎట్లా. ఎవరి నుంచి రావచ్చో తెలుసుకోవటం.

+ అనుభవాలు ఆధారంగా ఆలోచనలు చేయటం

+ ముందుచూపు ఎక్కువ, అదే భవిష్యత్ కి దారి అని నమ్మటం.

+ ఎలా ఎదుర్కొనాలో అనే వ్యూహంపై ఎక్కువ సమయం పెట్టడం, సమన్వయ మార్గాన్ని గుర్తుంచుకోవటం

+ 'ఎత్తులు– పై ఎత్తుల్లో దిట్ట' అనిపించుకునే అంతగా జాగ్రత్తపడడమేకాదు, అందుకు సాధన చేయటం.

+ కొత్తగా ఏమి చేయగలం? ఏమి చెప్పగలం? ఎట్లా చెప్పగలం– అనే విషయాల మీద ధ్యాస పెట్టడం.

+ గుడ్డిగా నమ్మిన సందర్భాల నుంచి బయటపడటం. తొందరగా సరిదిద్దుకోవటం

+ ప్రపంచ పోకడలు, పొగడ్తల భ్రమల్లో పడరాదు. స్థానికంగా, ప్రాంతీయంగా అన్వయించుకోవటం నేర్వాలి.

+ ప్రజావాణిలో ఏది, ఎంతమేరకు విశ్వసనీయమైనదో విశ్లేషించి తెలుసుకో గలగాలి. ఏది నమ్మాలో,నమ్మకూడదో గ్రహించాలి.

+ సమస్యా పరిష్కార మార్గానికి ఏ ఒక్కదానినో కాకుండా, పలు మార్గాలను పరిశీలించగలగాలి.

+ అనుచరుల హావభావాల ఓర్పు, కోపతాపాలు గమనించటం తెలియాలి.

+ నాయకులను తయారుచేయడంలో ఎన్.టి.ఆర్. ని గుర్తు చేసుకొని నిరంతర కృషి కొనసాగించటం.

+ "దూరపు కొండలు నునుపేనా!" ఇప్పుడు కూడానా! అని అప్రమత్తంగా వుండటం.

+ పొగడ్తలకి పొంగిపోకుండా నిభాయించుకోవటం.

+ రూమర్లు, పుకార్లు, నిజాలు, వార్తలకి తేడా తెలుసుకోగలగటం, వదంతుల మూలాలు గ్రహించటం, జాగ్రత్తపడటం.

+ ముందు వెనుకలు ఆలోచించటం. పరిష్కార మార్గాల విషయంలో ముందుచూపు ఉండటం.

+ చిన్నది, పెద్దది అని కాకుండా అన్ని విషయాలూ సీరియస్ గా తీసుకోవటం

+ ప్రతిరోజూ, ప్రతివారినీ కలవటం నుంచే కొత్త ఆలోచనలు, ఆత్మ విమర్శ

చేసుకోవడం మొదలవ్వాలి.

+ వ్యతిరేకులని మనమే పెంచుకుంటూ పోకుండా జాగ్రత్త పడటం, వాళ్ళపై దృష్టి కూడా పెట్టడం. దగ్గరయ్యే అవకాశాలు.

+ ఇంతకు ముందు తెలియనివాళ్ళని కూడా కలవటం. అందరినీ కొత్త కోణాల్లో చూడడం.

+ సున్నిత హాస్యం (humor) అలవరచు కోవటం.

+ పేర్లు గుర్తుపెట్టుకోగలగటం చాలా అవసరం, అలవాటు చేసుకోవాలి

+ టైము ప్రకారం కార్యక్రమాలు చేయటం.

రిపోర్టులు చూడటమేకాదు, అవగాహన?



రాజకీయనాయకులు చాలామంది పతాక శీర్షికలు మాత్రమే చూసి వార్తాపత్రికలను అవతల పడవేస్తుంటారు. పూర్తిగా వార్తలు చదివేవాళ్ళు తక్కువ. క్లిష్ట సమస్యలు, కష్టనష్టాలకు కారణాలు, కారకులు వంటి విషయాల్లోకి వెళ్ళే వాళ్ళు అరుదు. ఇక ప్రభుత్వంలో వున్నవాళ్ళలో కూడా రిపోర్టులు చదివి వివరాల్లోకి వెళ్ళే వాళ్ళు ఇంకా తక్కువ. అధికారులు ఇచ్చే క్లుప్త సమాచారంతోనే కాలం పూర్తవుతుంది. కూలంకషం అరుదు. ఇదే ఒక తేడా, ముఖ్యమైంది కూడా.

చంద్రబాబుకి కమిటీ, ఎక్స్ పర్ట్ రిపోర్టులంటే ప్రత్యేక శ్రద్ధ. అట్లాగే ప్రత్యర్థుల దృష్టితో చూడడం జరుగుతుంది. అయితే అది ఎక్కువ రాజకీయ కోణం నుంచి. నిష్పాక్షికంగా, నిశితంగా సమస్యలు పరిశీలించటం రాజకీయ నాయకులకు వీలుపడదా అనే విధంగా, దానికి తోడు తొందరేకాక మీడియా కోణం, తీరు నాయకులు సహజంగా ఆలోచించటం కష్టమేమో అనిపించేలా వుంటుంది.

సమీక్షల, సమస్యల, నిపుణుల, సందర్శకుల నివేదికలు., ఇట్లా ఎన్నో ప్రభుత్వ పదవుల్లో వున్నవాళ్ళ దగ్గరకే కాక రాజకీయాల్లో వున్న వాళ్ళ దగ్గరకు వస్తూ ఉంటాయి. వాటిని ఎంత వరకు ఉపయోగించుకో గల్గుతున్నారనే దానిపై వాళ్ళ కార్యదక్షత ఆధారపడి వుంటుంది. ఇది అందరికీ తెలిసిన విషయం. మరి ఈ విషయంలో మురికి రాజకీయాల నుంచి వచ్చిన వాళ్ళకీ మిగిలినవాళ్ళకీ తేడా ఏమిటి? చంద్రబాబు కూడా రిపోర్టు పూర్తిగా చదవకపోయినా విషయాన్ని ప్రశ్నల ద్వారా మూలాలు, కోణాలు తెలుసుకోవటానికి ప్రయత్నించటమేగాక, ఆ సమాధానాల నుంచి రిపోర్టు చదివినట్టుగా అల్లుకు పోవటానికి ప్రయత్నిస్తాడు, ఇదీ ఒక ప్రత్యేకత, విశేషతే. ప్రశ్నల ద్వారానేగా అవగాహన. ప్రతిపక్ష నేతగా అవకాశాలే ఈ మధ్య ఎక్కువ అనిపిస్తుంది. ప్రజల మీద పథకాల పర్యవసానం విషయంలో చురుకుదనం promptness తగ్గిందా అని కూడా అనిపిస్తుంది.

అవకాశాలకి అవధులు

అవకాశాలకి అవధులు అసలు ఉంటాయా? ఉంటే ఎంతవరకు? అనే ప్రశ్నలు. వాటిని గ్రహించి ఉపయోగించుకునే వాళ్ళ మీద ఆధారపడి వుంటుంది. అని జవాబు. అవకాశాలు అందనివాళ్ళు అరుదు. అవి వాళ్ళ జీవితాల్లో అయినప్పటికీ, వాటి వెంటనే గ్రహించలేని వాళ్ళే ఎక్కువ.

ఇది చిన్నప్పటి విషయమేమీ కాదు. వేరువేరు రంగాల్లో, ముఖ్యంగా హద్దులు లేని రంగాల్లో, అవకాశాలకి హద్దులుండవు. రాజకీయాల్లో వున్న వాళ్ళకి గత అర్హతలు Prior qualifications అంటూ లేకపోవడం వల్ల పోకడలకి అవధులులేవని చెప్పవచ్చు. చాలా వరకు నాయకులు అయేవాళ్ళు వచ్చిన అవకాశాలని గ్రహించి, సద్వినియోగపరచుకో గలవాళ్ళే. అవరోధాలను ఎదుర్కొని, అధిగమించటం, వాటిని వుపయోగించుకోవటం నాయకత్వ పరిపక్వతకు నిదర్శనాలు. చంద్రబాబు విషయంలో ఇవి కనబడుతుంటాయి.

చదువుకునే రోజులనుంచీ ఆయన అవకాశాలని జారవిడుచుకోలేదు. అందుకు ధైర్యం ఒక్కటే కాదు ఉన్నది, కావాల్సింది. ఇంకా ఎన్నో లక్షణాలు అని చెప్పటానికే నాకు బాగా తెలిసిన కొన్నిటిని ఈ పుస్తకంలో ప్రస్తావించాను. నాకు తెలియనివి ఇంకా ఎన్నో ఉంటాయి, సందేహంలేదు. అందరికీ, అన్నీ తెలియవు కూడా.

అవకాశం ఊడిపడదు. ఒక సమస్యని, ఒక క్లిష్ట పరిస్థితిని మార్పుల లోనుంచి వచ్చే దాన్ని గ్రహించటంలో వచ్చేదే అవకాశం. కొన్నిసార్లు అవకాశాలు బెడిసికొట్టవచ్చు కదా! చాలా మంది విషయంలో జరిగేది అదే.

కొన్ని అవకాశాలు జీవితాన్ని మలుపు తిప్పటమే గాక ఎంతోమంది జీవితాలని భవిష్యత్ ని కూడా మార్చగలవు. చంద్రబాబు విషయంలో అట్లాంటివి కొన్ని నాకు బాగా తెలిసినవి ఉన్నాయి. ఇవి బయటనుంచి, దూరం నుంచి గ్రహించిన విషయాలే. గత 20 రోజుల్లో గుర్తు వచ్చినవే ప్రస్తావించాను ఈ పుస్తకంలో.

పార్టీ మారటం, తనకు అరంగేట్రం ఇచ్చిన పార్టీకాదు., మొదటనే మంత్రి పదవి ఇచ్చిన పార్టీ నుంచి కొత్తపార్టీలోకి మారటం ఏటికి ఎదురీది అవకాశాలని వెతుక్కోవటమేగా? అదే ఎన్నికల్లో మామగారికి వ్యతిరేకంగా డాంబికాలు పలికి, ఎన్నికల్లో పరాజయం పాలై, పార్టీలో గెలవటానికి ప్రయత్నం 1983-85 మధ్య

విషయం. పార్టీ మార్పు ఒక్కరోజులో జరిగిన విషయం కాదు కదా. అవకాశాలు వచ్చినపుడు కష్టపడి, తనేంటో రుజువుచేసుకొని, ఎక్కువ అభివృద్ధి పనులు చేయటమే గాక రాజకీయాల్లో సమయస్ఫూర్తి చూపటం, కార్యకర్తల మనోభావాలని గ్రహించగలగటమే చంద్రబాబు ప్రత్యేకతలు కదా. ఇంటా, బయటా కొంత వ్యతిరేకత వున్నా తెలుగుదేశంలోకి ప్రవేశించటం, అదీ కొత్తపార్టీకి కొత్త రూపురేఖలు జిల్లాల వారీగా తీసుకురావటం ఎంతో కష్టమైన వ్యవహారం. నారాయణగూడాలో కొత్తగా పార్టీకి ఆఫీసుపెట్టడమూ అవకాశాన్ని వినియోగించు కోవటమే. శాయశక్తులా కృషితో అదే అప్పుడు ఎంతో మంది సహకారంతో చంద్రబాబు చేసింది.

దక్షతలో కొత్త ఆలోచనలు

ఎన్.టి.ఆర్ "**ప్రజల వద్దకు పాలన**" అనే ఆలోచనని తీసుకువస్తే, దానిని చంద్రబాబు ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నం చేశాడు. రాజస్థాన్లో అప్పటి ముఖ్యమంత్రి మోహన్ లాల్ సుఖాడియా 50 సంవత్సరాల క్రితం ఈ విషయంలో చొరవ చూపించారు. ఈ నాయకులే దేశం విషయంలో ప్రత్యేకత ప్రదర్శించారు.

అట్లాగే మహిళలు **డ్వాక్రా** పథకం, **జన్మభూమి**, **గ్రామ పంచాయతీల** విషయంలో వాటి నిర్వహణ, గ్రామ సభల్లాంటివి నిర్వహించటంలోచూపిన శ్రద్ధ అంతకు ముందు గాని, తర్వాతగాని లేదని చెప్పటంలో సందేహం లేదు. అదీ గ్రామాలని నిర్వీర్యం చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా, ఎన్నికైన సర్పంచులను అగౌరవావ పాలుచేయకుండా, పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో పలురకాలుగా వాటిని విస్తృతం చేయటం, వాటి ఉపయోగం పెంచటమే గాక కొత్తవారికి అవకాశాలిచ్చే విషయంలో నాకు అప్పుడు తెలిసినంత వరకు మరెక్కడా అంత బాగా జరగలేదు.

అయితే కార్యకర్తల అతి కుతూహలం వల్ల కొన్ని చోట్ల జరిగిన అనర్థాల వల్ల కూడా చెడ్డపేరు వచ్చింది చంద్రబాబుకే.

గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకోసం MNRGS ని చంద్రబాబు వినియోగించినట్టు మరెక్కడా జరగలేదు. పది సంవత్సరాల క్రితం విషయం. అయినా ఈ రోజుకీ(2024) తెలంగాణ గ్రామాల్లో ఈ అభివృద్ధి విషయాల్లో చంద్రబాబు గుర్తు వస్తున్నాడు.

కొత్త ఆలోచనలు– సమావేశాల నుంచే..

మొదటి నుంచి కూడా చంద్రబాబు ప్రత్యేకత **కొత్త ఆలోచనలని పరిగణనలోకి తీసుకోవడం**, విన్న మార్పు ఆలోచించకుండా ఎట్లా సాధ్యం!

ఎలా అమలు చెయ్యవచ్చు?

ఎవరికి ఎక్కువ ఉపయోగపడుతుంది?

ఎంత త్వరగా అమలుకి అవకాశం వుంది?

ఎక్కడ నుంచి మొదలు పెట్టాలి?

అని ఆలోచించటం ఆయన నైజం.

ఎవరికి వాళ్ళు సహకరించుకునే అవకాశాలు ఎంత వరకూ వున్నాయి?

అని ముందు డాక్టర్ సాంబశివరావు, లక్ష్మీనారాయణలాంటి అధికారులు చంద్రబాబు ఆఫీసులో కొత్త ఆలోచనలు, సలహాలు ఎవరి దగ్గరి నుంచి వచ్చినా వాటిని గురించి విచారించి,

ఎట్లా ప్రజల దగ్గరకి తీసుకు వెళ్ళాలి?

ప్రభుత్వ సేవలని అందించటంలో ఎట్లా ఉపయోగపడతాయి? అని ఆలోచించటం,

బాధ్యత ఎవరికి అప్పచెప్పవచ్చునో?

వివరించటం, మొదటి సారిగా సాంబశివరావుగారు లేక్ వ్యూ గెస్ట్ హౌస్ లో నా దగ్గరికి వచ్చి సమాలోచన చేసి నా దగ్గర నుంచి వచ్చిన దాదాపు 20 ఆలోచనలు, సలహాలని(1994-96 లో) వ్రాసుకున్నారుట ఆ తర్వాత **విజన్-2020** కమిటీలు వేసి వాళ్ళతో

ఈ విజన్ అంటే ఏమిటి?

ఎందుకు? ఎట్లా?

తమతమ శాఖలకి 2020కి అంటే వచ్చే 25 సంవత్సరాలలో ఏ విధమైన ప్రణాళికలు అవసరం?

అవి ఏవిధంగా వేసుకోవాలి? అనేవి తెలియ చెప్పి,

వివిధ రంగాల్లో వచ్చే మార్పులు, వాటి ప్రభావం ఆ శాఖ మీద ఎలా వుంటుంది?

అనే విషయాలు తెలియజేసి, 25 సంవత్సరాలకి అంచనాలు ఏ విధంగా వేయాలి?

అని శాఖలవారీగా తెలియజేశారు.అయితే అంతర్గతంగా జరిగినట్లు, ప్రజలతో కూడా బయట వివిధ జిల్లాల్లో అట్లాంటి సమాలోచనలు జరగాలి అనేదే నా సలహా. అది సాధ్యమైనంత వరకు స్వతంత్ర వ్యవస్థ ద్వారా జరిగితే ఇంకా మంచిది అని.

ప్రశ్నలు అడగడంలోనే వుంది– తమాషా

ప్రశ్నలు వేయడంలోనే వుంది మజా. సమాధానం నుంచే ఇంకా ఆలోచనలని విస్తృతం చేయడం చంద్రబాబుకి మొదటి నుంచి ఉన్న గొప్ప అలవాటు. విషయం తెలిసినదైనా

మళ్ళీ ప్రశ్నగా అడగటం,

మీరేమనుకుంటారు?

ఇంకా వేరే మార్గాలేమైనా ఉన్నాయా?

అని ఆయనకి పరిపాటి అయిందనిపించే రీతిలో అడగటం.

వచ్చినవాళ్ళని వెంటనే తన వాళ్ళుగా, ఆత్మీయులుగా భావిస్తూ ప్రశ్నలు అడగటం, అడిగే విధానంలోనే ఆ తమాషా వుంది. **సంప్రదింపులకు సంభాషణలు నాందీ** అన్నట్లు కూడా.

ప్రశ్నలు మనిషి జీవితాన్ని తీర్చిదిద్దటానికి ఎట్లా ఉపయోగపడతాయో తెలుసుకోవటానికి యక్షప్రశ్నల లోకంలోకి వెళ్ళనవసరంలేదు.

చంద్రబాబు తనవద్దకు వచ్చే,పోయే వాళ్ళతో సంభాషణ ఏ విధంగా మొదలు పెడతారు? సంప్రదింపులు ఎల్ల మొదలవుతాయి?

గుర్తుచేసుకోండి. ఆయన కార్యకర్తలతోనే కాదు ముఖ్యఅతిథులతో కూడా అదే రీతిలో వ్యవహరించి వాళ్ళ అభిమానానికి పాత్రుడవుతాడు.

ఉదాహరణకు చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కి మొదటి ముఖ్యమంత్రిగా 2014 లో చాలారోజుల తర్వాత ఢిల్లీ వస్తే మర్యాదపూర్వకంగా వెళ్ళి కలిశాను. తొలిమాట...

‘‘రండి.. రండి భాస్కరరావుగారూ, మీరు ఏ దేశరాజధాని గురించి అయినా స్టడీ చేశారా?

ముఖ్య పట్టణాల గురించి ఇప్పుడు మనం ఏమి తెలుసుకోవచ్చు?

అప్పటికే ఆయన అమరావతిమీద ధ్యాస అని నేను వినటం జరిగింది. అయితే అప్పుడు భారత ప్రభుత్వం ఏర్పాటుచేసిన గోపాలకృష్ణ కమిటీకి నేను వేరేచోటును కొత్తరాష్ట్రానికి రాజధానిగా ప్రతిపాదించి,వివరించాను. అదే గోపాలకృష్ణగారు కూడా సూచించారు. అది చెబితే చంద్రబాబు

అమరావతి ఎందుకు సరైన రాజధాని?

అభివృద్ధికే కాక ఆలోచనలు, సాస్కృతిక భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుంటే ఎట్లా వుంటుంది?

అని మళ్ళీ ప్రశ్నరూపంలో నా ముందు పెట్టి మళ్ళీ మా మధ్య పాత సాన్నిహిత్యాన్ని గుర్తుచేస్తున్నట్టుగా, నిలబెట్టుకుని ఆయన ఒక నాయకుడుగా ఏ విధంగా పరిణితి చెందాడో చెప్పకనే తెలియచెప్పారు.

ఆత్మవిమర్శ, అవుట్ సోర్సింగ్ గానా?!

చాలా మంది రాజకీయనాయకులకు **ఆత్మ విమర్శ** అలవాటు వుంటుంది. చంద్రబాబుకు మొదటి నుంచి కూడా **ఆత్మవిమర్శ ఒక ఆయుధం** అని చెప్పొచ్చు. తెలిసీ తెలియని దినచర్యగా ఆత్మవిమర్శ స్వరూపం వేరుగా వుంటుంది. ఎప్పుడో ఏవో కష్టాలు, నష్టాలు ఎదుర్కొన్నప్పుడు చేసుకునే ఆత్మ విమర్శలు వేరు. దీన్నే ఇంగ్లీషులో Feed back అని నీరు గార్చేశారు. ఆత్మ విమర్శ జ్ఞానోదయం కలుగచేసే కొత్త శక్తినిచ్చే ఒక ఉపాయం. Feed back తాత్కాలిక చిట్కా మాత్రమే. అది స్వభావాన్ని ప్రశ్నించుకోనివ్వదు.

చంద్రబాబుకి ప్రస్తావన ద్వారా నల్గురితో ఆత్మవిమర్శ చేసుకునే అలవాటు వుండేది. పార్టీ పెద్దదయి వ్యతిరేకవర్గం పార్టీకూడా తీవ్రరూపం అయినప్పుడు ఆత్మవిమర్శ స్వరూపం రూపురేఖలే మారిపోతాయి. అదే జరిగింది చంద్రబాబు విషయంలో కూడా. ధైర్యం, దూరదృష్టి , స్వీయనియంత్రణ Self control వున్నపుడే ఆత్మవిమర్శ ఉపయోగం వుంటుంది.

ఆత్మవిమర్శ నుండి Feed back లోకి అది outsourcing రూపంలోకి మారుతుందో, కారణాలు ఏమైనా, అప్పుడే అది సర్కస్ తాడు మీద సైకిల్ వ్యవహారం అవుతుంది. చంద్రబాబు విషయంలో అదే జరిగింది. 2019 లోనే కాదు.

అంతకు ముందు కూడా వెంటనే గ్రహించలేదనిపించింది. అంతకు ముందే ఒకసారి చెప్పినా ప్రయోజనం కనపడలేదు.

చంద్రబాబు ముఖంలో ఆశ్చర్యమే ఎక్కువ, కోపం తక్కువ. అయితే చాలామంది ఆయన ముఖం అనుభూతులతు అతీతం. హావభావాలు కనబడవు అంటారు. రాజకీయాల్లో చీటికి మాటికి ముఖంలో ప్రతిబింబించకుండా వుండగలగటం విశేషమే. చంద్రబాబు విషయంలో ఇది చాలా వరకు ఉపయోగపడినట్లు నాకు అనిపించింది. ముఖ్యకార్యకర్తల దగ్గర కోపం క్షణికంగా ప్రదర్శించడమేగాని బహిరంగ సమావేశాలలో ఆవేశం, అధికార దర్పం ప్రదర్శించడు. నిబ్బరమైన నాయకుడు గదా? లేక స్థితప్రజ్ఞుడా? పార్టీ రాజకీయాల్లో అది సాధ్యమా!

టెలిఫోన్ ద్వారా వచ్చే Yes /No **అవును, కాదు** సమాధానం మీద ఆధారపడో. ఎక్కడ నుంచో వచ్చిన బయటి ప్రయివేటు వ్యక్తులు ఇచ్చే ముక్తసరి Feed– back లే చంద్రబాబునైనా కొంప ముంచేవి. ఈ విషయంలో చంద్రబాబు కొంత అలసత్వానికి లోనయ్యాడేమో అనిపించింది. ఓడిపోయిన రెండుసార్లే కాదు, కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో కూడా అని నా అభిప్రాయం.

ఆత్మ పరిశీలన తగ్గుతూ వచ్చిందా?

క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతోంది?

ప్రజలు ఏమి అనుకుంటున్నారు?

పనులు సక్రమంగా జరుగుతున్నాయా?

అనే కుతూహలం మొదట్లో మెండుగా వుండడం చంద్రబాబు మంచి పేరుకి కారణం. అయితే రాను రాను ఏ పద్ధతిలో అనే విషయం మీద ఆ తర్వాత పప్పులో కాలేశాడేమో అనిపించింది నాకు. అప్పుడప్పుడు ఫోన్ ద్వారానో, out source మీద

ఎక్కువ ఆధారపడటం, ఫారిన్ కన్సల్టెన్సీల మీద ఎక్కువ ధ్యాస పెట్టడం లాంటి ప్రయోగాలు బెడిసి కొట్టాయనుకుంటాను.

వెంటనే గ్రహించలేక పోవటమూ, అయితే చంద్రబాబు ప్రత్యేకత తప్పులు దిద్దుకోవడంలో దిట్ట. చెప్పినా, చెప్పకపోయినా ఇతర రాజకీయ నాయకులతో పోల్చితే 2019 లో Dr. Judge P.C. Rao గారితోపాటు మర్యాదపూర్వకంగా కలిసినప్పుడు ప్రత్యేకంగా నేనే ఆయన దృష్టికి తీసుకెళ్ళాను. అయినా ఊబిలోంచి బయట పడలేకపోయాడా అనిపించింది.

నాకు తెలిసిన కాలంలో చంద్రబాబు ప్రత్యేకత – **ప్రత్యర్థుల మీద ఒక కన్నేసి ఉండటం**. అది రాజకీయాల్లో అందరూ చేసే పనే. అయితే ఈయన ప్రత్యర్థులు కావచ్చు, అయే అవకాశం ఉందనుకున్నవాళ్ళ మీద కూడా సంబంధాలతోపాటు వాళ్ళ కార్యక్రమాల మీద దృష్టిపెట్టడం. అదీ పార్టీలోనే ఇతరుల ద్వారా విశ్వసనీయత, ప్రజాదరణ, అప్రమత్తతలను ఒకే గాడిన చూడటం ఎన్నో అనర్థాలకి కారణం. ఫోన్ ద్వారా చెప్పుకునే టప్పుడు అది గొప్పగా వుండేది. ఒకేదాని మీద ఆధారపడితే నాయకులుకూడా గతి తప్పుతారు. మోసపూరిత రాజకీయాల్లోకి వెళతారు. అప్పుడు మాయాబజార్ ప్రభుత్వాలు వెల్లివిరుస్తాయి. అదే ఈ మధ్యకాలంలో జరిగేది.

'**ప్రభుత్వాలు పార్టీలవి కాదు, పార్టీల కోసం అసలే కాదు. ప్రజలందరి కోసం**.' అని గ్రహించి ఆ విధంగా పరిపాలన అందించగలిగితేనే మంచి ప్రభుత్వాలు, మంచి పరిపాలన సాధ్యం. అప్పుడే చెప్పుకోవచ్చు. అయితే అది మన ఎన్నికల విధానాల్లో మార్పు వస్తేనే సాధ్యం అని ఇంత వరకూ గ్రహించలేదు చంద్రబాబు. ఈ విషయంలో ఒక మంచి అవకాశాన్ని జారవిడుచుకున్నాడు అనిపిస్తుంది నాకు. 2022 లో నా Next Best Game Change of Elections అనే నా 20వ ఇంగ్లీషు పుస్తకంలో అది ఎట్లా సాధ్యమో వివరించాను. కొత్త

రాజకీయాల్లోకి దారి చూపించకల్గిన మార్పు తీసుకురాగల్గిన సత్తా చంద్రబాబుకి వుంది. అయితే ఆయన స్థానిక అత్యవసర పార్టీల కూపంలో ఇరుక్కుపోయారు. తెలియక కాదు, దేశ దురదృష్టం.

మన భవిష్యత్ మన చేతుల్లోనే వుంది. భవిష్యత్ గురించి ఆలోచించగల నాయకత్వమే ఈ రోజు కావాల్సింది. అదే శ్రీరామరక్ష.

ఓడిపోతాం అనే భయం

ఎన్నికల్లో ఓడిపోతామనే అనే భయం, ఓడి పోవచ్చునేమో అనే సందిగ్ధం రాజకీయనాయకులు తట్టుకోలేని నిజాలు. ఆ స్థితిలో తొందరపాటు చర్యలు చూస్తుంటాం. చంద్రబాబు విషయంలో కూడా అది వర్తిస్తుంది. అయితే ఆయనది కనపడనీయని నైజం. ఈ విషయంలో చంద్రబాబు చాలా వరకు తనను తాను నిభాయించుకునే సామర్థ్యాన్ని కుటుంబం నుంచి కూడా పొందిన అదృష్టవంతుడు. ఓటమి నుంచి నిలకడ, నిజమైన గెలుపు వస్తుంది అని నమ్మకం. అదే నాయకుడి ప్రత్యేక శక్తి. ఓడిపోవటం ద్వారా రాజకీయాల్లో మంచి మార్గాలకి అవకాశం వుంది అని గ్రహించాడు. అది తెలుసు కోవటంలోనే వుంది భవిష్యత్, గొప్పదనం.

రాజకీయ నేతకి కొండంత బలం ఎక్కడనించి వస్తుంది?

ఆస్తి నుంచా? ఆలోచన నుంచా? అంగబలం నుంచా?

ఏది శాశ్వతం?

పూర్వమహారాజులకే ఎక్కువ తెలుసు అనుకుంటా. అయితే వాళ్ళకి అడిగేవాళ్ళు లేరు.

ఏమీ లేవు, ఆలోచనా అలవాట్లు తప్ప అని గ్రహించటం.

రాజకీయాలలో కూడా ఏదీ మీతో శాశ్వతంగా వుండదు.

అని గ్రహించినప్పుడే, కష్ట సమయాల్లో కూడా మనశ్శాంతి, ప్రశాంత ఆలోచనలకి అవకాశం వుంటుంది. కొత్త పోకడలు సాధ్యం...

ఒంటరి పోరుకీ సిద్ధమే, అవసరం అయితే..

ఎవరో వస్తారు. ఏదో ఇస్తారనో, తెస్తారనో రాజకీయాల్లో సామాన్యంగా కనపడే ఆశ, ఆకాంక్ష. పాత పార్టీల్లోనే అది ఎక్కువ. ప్రభుత్వంలో ఒక బృందం/జట్టులో అప్పుడప్పుడూ కనిపించడం, అనిపించటమే ఎక్కువ అని సంతృప్తి పడతారు. అనిశ్చితిలో వున్నప్పుడు ఇంకా ఎక్కువ అనిపిస్తుంది. విచిత్రం ఏమిటంటే నాయకుడి స్థానానికి తిరుగులేదనుకున్నపుడు, బృందం ఉందా? లేదా? అనిపిస్తుంది. అపరిచితుల దగ్గరి నుంచి అందే బయటి వనరుల out source మీద ఎక్కువ ఆధారపడే మార్గాలే వెతుకుతారు. చంద్రబాబు విషయంలో కూడా అదే ఆయన దారి. ఎక్కువగా, నాయకుల మధ్య అపోహలకి, పోరుకు కారణం అట్లా దిగజారటమే. నమ్మకం అడుగంటి పోయిందా అనిపిస్తుంది. పార్టీలు, నాయకుల మధ్య మరి కలసి ఎట్లా పనిచేయగలరు? ఎలా సహకరించుకోగలరు? ఎన్టీఆర్ గారు ఈ విషయంలో గొప్ప ఆదర్శవాది. వ్యతిరేకులని కూడా నమ్మే స్వభావం ఆయనది.

అందుకే చంద్రబాబు విషయంలో చాలాసార్లు కొట్టొచ్చే రీతిలో రాజకీయ అంతర్గత వ్యవహారాలలో ఎక్కువగా ప్రాతినిధ్యం delegation ఉండకపోగా కొంత రహస్యానికి secrecyకి తావుంటుంది. చంద్రబాబు ప్రతిపక్ష నాయకుల కదలికలు గమనించడంలోనేగాక వాళ్ళ స్థితిగతులు గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు. ఆయన మిత్రులు ఒకప్పుడైనా (నేను కూడా) ఎక్కువ అట్లాంటి కార్యక్రమాల్లోనే వుండి వుంటారు. అంతర్గత అనిశ్చిత పరిస్థితుల్లో మరీను. అది సొంతపార్టీలో కూడా. అనుమానాస్పద సమయంలో, వ్యక్తుల విషయంలోగాని ఇదే. అందుకే ఆయన కొంత Feed back శక్తిని కోల్పోయారా అనిపిస్తుంది, Feed back ని

validate తనిఖీ చేసే విధానాలను తరచు పరీక్షించుకోవాలి. ఎన్నికల్లో పరాజయం ఎదుర్కోవడం. కొన్నిసార్లు అదే కారణం అయింది.

స్నేహమే బంధం, అయినా...

'రాజకీయాలలో శత్రువులు, స్నేహితులు ఎల్లప్పుడూ ఒకే రీతిగా కొనసాగరు' అనేది అందరూ చెప్పేదే. అయితే దాన్ని గ్రహించి సమతుల్యంగా అందరినీ అక్కున చేర్చుకోవటంలోనే వుంది నాయకత్వ ప్రత్యేకత. చంద్రబాబు మొట్టమొదటి నుంచీ తెలుసుకోవటమే కాదు, ఏ విధంగా "**తనవాళ్ళు**" అనే వాళ్ళ విషయంలో కూడా జాగ్రత్తగా ఉండడం ఎట్లా సాధ్యం! అందరితోనూ ఎప్పుడూ Live relation ship, కొన్నిసార్లు అతిగా అనిపించే విధంగా మిత్రులను పోగొట్టుకోవడం జరిగేదే. సత్సంబంధాలతో మెలగటం, అంతేగాక, వాళ్ళ రాజకీయ కదలికలు, పోకడలే గాక వాళ్ళ కష్టనష్టాలు, ఎదుర్కొంటున్న సంఘర్షణలని గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వుండటమే గాక వాటిని గురించి అడగటం, తెలుసుకుని సహాయ సహకారాలు అందించటమే చంద్రబాబు మొదటినుంచి అలవాటు చేసుకున్నాడు. అందరి గురించి తాను తెలుసుకోవటమేగాక, వాళ్ళ చుట్టుపక్కల తన అభిమానులని గుర్తించటం, వాళ్ళ ద్వారా తన సమకాలీన **రాజకీయాల్లో ప్రత్యర్థులు కావొచ్చు** అనుకునే వాళ్ళ మీద "ఒక కన్నేసి ఉంచటం". అట్లా చాలా మందితో ఎక్కడున్నాసరే ఫోన్లో ఒకసారి పలకరించి, అంతా సజావుగా వుంది అనే భావనతో నాయకత్వ పటుత్వం పెంచుకోవటం. ఇది చంద్రబాబుకు మొదటి నుంచీ ఉన్న ఒక అలవాటు. ఉదాహరణకి నాతో ఎక్కువగా కొన్నాళ్లపాటు దినచర్యా అనే విధంగా. ఉదయాన్నే మాట్లాడి, కొంతమంది నాయకుల గురించి ప్రత్యేకంగా తెలుసుకోవటం. ఉపేంద్ర ఆ కోవకు చెందినవాడే.

అట్లా నాతో స్నేహాన్ని పెంచి బలపరచుకోవటమేగాక, నా ద్వారా వేరువేరు నాయకులు, క్వార్టర్స్ లో, ఢిల్లీలో, హైదరాబాద్ లో, దేశంలో ఇతర చోట్ల ఏమి

జరుగుతున్నదీ తెలుసుకోవటం, ఇంకా ఇతరుల దగ్గర నుంచి కూడా అలాగే తెలుసుకుంటూ తన Confidence level పెంచుకోవటం చంద్రబాబుకి అలవాటు అని చెప్పగలను.

గోడమీద పిల్లి వాటంగా వుండే వాళ్ళే రాజకీయాల్లో ఎక్కువ వుంటారు. అసలు స్వరూపాలు తెలియడం క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడే. అంటే ఎప్పుడూ ఏదో ఒక సమస్య మీద కొంత ఆదుర్దా అవసరం. అప్పుడే ఎవరేమిటో తెలుస్తుంది అని ఆయన ఆలోచనా విధానము కావచ్చునేమో.

అందుకే నాయకులకి రాజకీయాలలో "భూతద్దాలు" అవసరమేమో అనిపిస్తుంది. అట్లా చూస్తేనే నాయకులు ఎప్పటికప్పుడు వాళ్ళ సుస్థిరతని అంచనా వేసుకోగలరు. అందుకే వాళ్ళకి, పరీక్షించుకుంటూ వుంటానికా అన్నట్లు, ఏదో ఒక క్లిష్టసమస్య ఎప్పుడూ వుండాలి.

విందులు, వినోదాల ద్వారానే కాకుండా ఎప్పటికప్పుడు కలసి ఒకరినొకరు తెలుసుకోవచ్చు. మన ఆచారాలు, కుటుంబ, సమాజ సమస్యల ద్వారా కూడా ఒకరిని ఒకరు కలవవచ్చు, స్నేహాన్ని బలపరచుకోవచ్చు. అట్లా కాకుండా కక్షలు, కార్పణ్యాలు రాజకీయాల్లో సృష్టించబడేవే ఎక్కువగా. అవి లేకపోతే మన రాజకీయాలు పరిణతి చెందలేదనేలా ఉంటాయి. మరి నాయకులు ఎందుకు ఈ విషయం గ్రహించటంలేదు? గ్రహించినా ఎందుకు మార్చుకో లేకపోతున్నారు? ఇది అందరికీ వర్తించే సమస్య.

పదవితో సంబంధం లేకుండా ఆలోచించటం

అధికారంలో లేకపోయినా, నాయకుడుగా మనుగడ సాధించినప్పుడే నాయకత్వానికి నిలువెత్తు అర్థం. పదవిలో లేనప్పుడు ఒక ఎజెండాతో **పదండి ముందుకు** అనే రీతిలో వెళ్ళగలిగినప్పుడే నాయకుడు ఆవిర్భవిస్తాడు, ఆదర్శం

అవుతాడు. **సమాజం కోసం పనిచేయాలి** అనేది రాజకీయ నాయకుల ప్రథమలక్ష్యం. పార్టీకోసం కంటే అధికారం, వచ్చినా, రాకపోయినా ప్రజలతో ఉండటం, వాళ్ల సమస్యలు, వాళ్ళ భవిష్యత్ కోసం పనిచేయటమే అనుకోవాలి. ప్రజల కోసం అంటే ఓట్లకోసం, పదవికోసం మాత్రమే కాకూడదు.

లేకపోతే, ఒకసారి ఎన్నికైతే ఏ ఎన్నికైనా పదవి అయినా ఒక పరిమిత కాలానికి, అయిదు సంవత్సరాలకి అని, ఆ తర్వాత ఎన్నికైన వాళ్ళకి ఒక మంచి సంప్రదాయాన్ని ఇవ్వాలనే ధ్యాస ఉంటేనే నాయకుడు అనిపించుకుంటాడు. అట్లా కాకుండా పబ్బం గడుపుకునే రీతిలో ఎన్నికైన వాళ్ళు ప్రవర్తిస్తే వాళ్ళు నాయకులు అవుతారా!

అమరావతిలో హైకోర్టు, సచివాలయం పనిచేసే విధంగా ఏర్పాటు చేసి నిజాయితీగా, ఇవి “తాత్కాలికం" మాత్రమే అని చెప్పటం (నోరు జారారా?) వల్ల, రాజధానిలో ఎన్నికలని మాత్రమే దృష్టిలో పెట్టుకోకుండా చెప్పినందుకు రాజధాని కట్టలేకపోయాడనే అపవాదు భరించాల్సి వచ్చింది. రాజకీయ ప్రతిపక్షానికి తోడ్పడినట్టయింది కూడా. చంద్రబాబు అధికారంలో వున్నా లేకపోయినా ఒక గొప్ప రాజధానిని నిర్మాణం చేస్తున్నది భ్రమా అనిపిస్తుంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

పగ పెంచటం నాయకుల క్రీడా?

ప్రస్తుత రాజకీయాల్లో నాయకులు పగ, పొగరుని వాళ్ల మధ్యనేగాక, అదే మనుగడ అన్నట్లు, ప్రజల్లో పెంచిపోషిస్తున్నారు.. నష్టపోయేది ప్రజలూ, వాళ్ళ భవిష్యత్తే. ఈ ధోరణిని తగ్గించే ప్రయత్నాలు ఏమన్నా చేస్తున్నారా ఆలోచించండి. ఎన్నికలు తిట్టుకోటానికో, కొనుక్కోటానికో, కొట్టుకోటానికో అనే విధంగా తయారైనవి. **కలసి పనిచేద్దాం**, **మన లక్ష్యాలు ఒకటే కదా** అనే ఇంగిత జ్ఞానం లేకుండా పోయిందా అన్నట్లు ఎన్నికల్లో పాల్గొంటున్నారు. ప్రతి ఎన్నిక అలాగే తయారైంది.

నాయకుడు ఆ అవలక్షణాలను గ్రహించాలి, గర్జించాలి కూడా. ఇప్పుడు జరుగుతున్నది **రెచ్చగొట్టడం**. ఎట్లాంటి నాయకుడు మార్పు తీసుకురాగలడు?

చంద్రబాబు నాకు తెలిసినంత వరకూ ఎవరినీ, ఎప్పుడూ పరుషబాషను వాడినట్లు నేను వినలేదు. ఆయన్ని బహిరంగంగా పదేపదే ఎన్నో తిట్లు తిట్టిన వాళ్ళని కూడా ఒక్క మాట తిరిగి అన్నట్టు వినలేదు. గత 4–5 సంవత్స రాలుగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దిగజారుడు భాష, పురికొలిపి పిల్లలు కూడా సిగ్గుపడే విధంగా వుందనటం అతిశయోక్తి కానే కాదు. రాజకీయాల్లో ఈ స్థితికి వార్తా మాధ్యమాలు కూడా కొంత బాధ్యత వహించాలేమో. వాళ్ళ తీరును ప్రోత్సహించటమే ఎక్కువ కనబడుతోంది. రాజకీయ నాయకులు వాళ్ళంత వాళ్ళు నియమాలు పాటించకపోతే వాళ్ళ నాయకత్వ గొప్పతనం ఏమిటి? వచ్చే తరానికి ఏమైనా ఆదర్శాలు మిగుల్చుతారా!

ఈ విషయంలో ఈ మధ్య లోకేష్ చెప్పిన విషయం నన్ను ఎంతో అబ్బురపరిచింది. తను బహిరంగ సభలలో పరుషంగా మాట్లాడితే అట్లా మాట్లాడటం టీవీలో చూసి తన తల్లి ఫోనుచేసి మందలిస్తుందని చెప్పటం. ఎంతమంది రాజకీయ నాయకులకి అట్లాంటి అదృష్టము లభిస్తుంది?

చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం

కొంత మంది మాటకారి నాయకులు ముందు కాళ్ళకు బంధాలు వెయ్యటంలో ఆరితేరి, నివురుగప్పిన నిప్పులా ఉంటారు. మరీ ముఖ్యంగా వాళ్ళు అదే ఉద్దేశంతో నాయకుల ఎన్నికల పట్టు, విడుపులను తెల్సుకుని, తర్వాత నాయకులకు కొరకరాని కొయ్యలాగా తయారవుతారు. నమ్మకం అట్లాంటి వాళ్ళ బోనులో పడేట్లు చేస్తుంది. అదే జరిగింది. చంద్రబాబు 2004 ఎన్నికల్లో మోసపోవటానికి కూడా దారి తీసింది. చంద్రబాబుని గెలుస్తున్నావని నమ్మించి complicancy trap లో పడే విధంగా

చేశారు. ఈ విషయం కొద్దిమందికి కూడా తెలియదు. ఎన్నికలు కాగానే ఆ వ్యక్తే చంద్రబాబుని అప్పుడు అనరాని మాటలతో విమర్శిస్తూ తిట్టడం రోజువారీ పనిగా పెట్టుకున్నాడా అన్నట్లు ప్రవర్తించాడు తనకు పదవి లభించే దాకా. చివరకి ఒక రోజు ప్లానింగ్ కమిటీ పూర్వ అధ్యక్షుడు కుటుంబరావు నాకు ఫోన్ చేసి ఏమండీ "మీరే ఫలానా వ్యక్తికి మూలం" అని వింటున్నాం. మాకు అతన్ని గురించి చెప్పగూడదా? అని అడగాడు. ఆ వ్యక్తిని గురించి ఎవరి దగ్గర అంతక ముందుగాని, ఆ తర్వాతగాని నేను నోరు విప్పలేదు. అంతే కాదు ఆయన నా ప్రోత్సాహంతోనే ఆ రంగంలోకి దిగాడు. ఆయన వృత్తినైపుణ్యాలను మాత్రం ఆ తరువాత కూడా మెచ్చుకున్నా. మరి చంద్రబాబు అతని మీద నమ్మకంతో అతన్ని ఎన్నికల్లో నిమగ్నం చేయటానికి కారణం అతను సంస్థలో నా దగ్గర పని నేర్చుకుని నా సంస్థ నుంచి వచ్చాడనే గదా? మరి ఆయన ఎందుకు నాతో మాట వరసకన్నా చెప్పకుండా ఆ బాధ్యత అప్పచెప్పాడు. అని అడగటం జరిగింది.

ఆ వ్యక్తిని చంద్రబాబు పనులు అప్పగించాడనే విషయం నాకు తర్వాత తెలిసింది. చంద్రబాబు నమ్మితే అట్లా వ్యవహరిస్తారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న రీతిలో. కుటుంబరావుగారు మాట్లాడిన తీరు అదే. అందుకే నాయకులు ముందు జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. అపార్థాలను ఎదుర్కొన్నా సరే, కొందరు అట్లాంటి అనుమానాల నుంచి బయట పడలేకపోతారు.

రాజధాని మనదేరా! వైభవాన్ని ప్రతిబింబింపచేసేది

భవిష్యత్ మీదే కాక తనమీద తనకు నమ్మకం వున్న ఏ నాయకుడూ తేలిక మార్గాన్ని తీసుకుని ఒక అవకాశాన్ని జారవిడుచుకోడు. ప్రజలని కూడా అదే మార్గంలో, అదే ఆలోచనలతో ముందుకు తీసుకువెళ్ళటానికే చూస్తాడు. అదే చంద్రబాబు తీరు. చాలామందికి అంతుబట్టదు, అర్థంకాదు కూడా. రాష్ట్ర భవిష్యత్ విషయంలో ఇంకా ఎక్కువ ఆలోచన ఉండాలి, దూరదృష్టి, ధైర్యం ఉండాలి కదా?

వ్యతిరేకులనుచి దిగజారకుండా తట్టుకోవటానికి వెనుకాడని దక్షుడు. పార్టీ రాజకీయాలు పాకుడురాళ్ళు అని తెలిసి కూడా ప్రస్తుత దేశ రాజకీయాల్లో నిర్ణయాలు తీసుకోవటంలో ఎవ్వరూ సాటిలేరు అన్నట్లు తీసుకున్న నిర్ణయాలు నాకు గుర్తుకు వస్తాయి. చంద్రబాబు విషయంలో అప్పుడున్న పరిస్థితుల్లో **రాజధానిని హైదరాబాదు నుంచి తరలించటం** ఒక గొప్ప నాయకుడు మాత్రమే ఆలోచించి, నిర్ణయించి అమలు చేయగలడు...

విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా హైదరాబాదు పది సంవత్సరాలు కొనసాగవచ్చునని పొందుపరచారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాదు కొనసాగవచ్చు. చండీగఢ్, హర్యానా– పంజాబు రాష్ట్రాలకి ఎన్నో సంవత్సరాలనుంచి అట్లా కొనసాగుతోంది. హైదరాబాదు రాజధానిగా వుంటానికి రెండు తెలంగాణ జిల్లాలు దాటి వెళ్ళాల్సి వస్తుంది అంతే. కొత్తగా విభజించబడ్డ రాష్ట్రం అయిదు సంవత్సరాలైనా అక్కడే రాజధానిని కొనసాగించవచ్చు. అదే తేలికైన విషయం. అయినా చంద్రబాబు ఎంతో క్లిష్టమైన మార్గాన్ని కావాలి, అని అమరావతి రాజధానిగా సంప్రదింపుల తర్వాత నిర్ణయించి అక్కడికి వెంటనే మార్చారు. ప్రభుత్వ ఉద్యోగులు హైదరాబాదులో ఎన్నో సంవత్సరాల నుంచి కుటుంబంతో వున్నవాళ్ళని అమరావతి తరలించటం, అదీ యుద్ధప్రాతిపదికన. ఆలోచిస్తే ఇది అసాధ్యమైన పిచ్చిపని అనిపిస్తుంది కూడా. అయినా చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ దృష్ట్యా అదే చేశారు. అది ఎంత దూరదృష్టితో చేసిందో సింహావలోకనం చేసుకుంటే, అది మామూలు రాజకీయపార్టీ నాయకులు చేసేవాళ్ళా? చేయగలరా!

రాజధానిని తరలించటం ఒక సమస్య అయితే, నిర్మించటం ఇంకా పెద్ద సమస్య. ఆ నిర్ణయం తర్వాత రాజధాని ఎక్కడ అనేది అత్యంత క్లిష్టసమస్య. మూడూ క్లిష్ట సమస్యలే. చిక్కులతో రాజకీయాలతో మరీ పీటముడులు పడినవే. అయినా వాటిని కొన్ని నెలలలోనే నిర్ణయించటమే కాదు, రంగంలోకి దిగి, ఉద్యోగులనే కాక

రాష్ట్రప్రజలని కొత్త ఆలోచనలతో నింపటం. నిరుత్సాహంలో మునిగిన ప్రజలని అలుపు, సొలుపు లేకుండా కలుపుకుపోవడం సాధ్యమా? ఒక గొప్ప బృహత్తర ప్రణాళిక, అదీ వనరులు, అందరి సహకారాలు లేకుండా, రూపొందించటం సాధ్యమా? అసాధ్యాన్ని సుసాధ్యం చేయటం వల్లనే అది దేశరాజకీయాల్లో ఒక గొప్ప మార్పుకి సంకేతంగా మిగిలింది. క్లిష్ట రాజకీయ సమస్యని ఎదుర్కోవడానికి పాఠాలు నేర్పుతుంది.

అమరావతి విషయంలో

అమరావతి రాజధాని ఆలోచన, అందుకు చేసిన కృషి భావితరాల నగరాల ప్లాన్ (2015–17) ఒక గొప్ప 21వ శతాబ్దపు గొప్ప సంఘటనగా నిష్పక్ష పాత ఆర్థిక శాస్త్రవేత్తలూ, సాంఘిక శాస్త్రవేత్తలూ చూస్తారు. అందుకేనేమో అమరావతి అంతానికి ప్రయత్నించి "చెడపకురా చెడేవు" నానుడి గుర్తు చేశారు కొంత మంది అసూయపరులు, అమాయకులు.

చంద్రబాబు ఎంతో ఆలోచించి ఎన్నో సంప్రదింపుల తర్వాతే అమరావతి నిర్ణయానికి వచ్చాడని చాలా మందికి తెలుసు. మరి ఆ ఆలోచన రాజకీయాల్లో భాగంగా భావించినప్పుడు దానిని ప్రతిఘటించి విచ్ఛిన్నం చేయాలనుకునే వారు వుండటం సహజమేనేమో! అయితే రాష్ట్ర ప్రయోజనాలు కోరేవారు కూడా అందులో వుండటం విషాదంగా మిగిలిపోతుంది.

2014లో ఎన్నికల్లో గెలిచి ఢిల్లీ వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా నేను కలిసినప్పుడు చంద్రబాబు నన్ను అడిగిన ప్రశ్న ''రాజధానుల గురించి ఏమైనా పరిశీలించారా?'' అని. అప్పుడు నా వాదనలో మొదటిది అమరావతి కాదు. అయితే ఆయన ఆలోచన విశేషతని ఆ తర్వాత సరైందని భావించాను. రాజధాని అంటే రాష్ట్ర ప్రధానకేంద్రమే కాదు, దేశంలో, ప్రపంచంలో ఒక మోడల్ గా, **నమూనా** ఉండాలి. అది ఎట్లా ఉండాలి అనే ఆలోచన బయట పెట్టినప్పుడు గాని ఆయన అమరావతి ఆలోచన ఎంత విశేషతతో కూడినదో నాకు అర్థం కాలేదు.

అసలు హైదరాబాదు నుంచి ఎంతో శ్రమ, ధైర్యం చేసి వెంటనే తరలిరావడంలోనే వుంది చంద్రబాబు భవిష్యత్ దృక్పథం. అయితే ఆ ఆలోచన అయిదు సంవత్సరాలకే పరిమితం కాదు, తరాలకు సంబంధించిన సుస్థిరత్వం గురించేకాక ఇతరులకు మనం ఎట్లా ఆదర్శం కావాలో అలా అవుదాం అనే ఆలోచన. "**తాత్కాలిక**" కట్టడాలు అనే పదం పదేపదే వాడడం వల్ల ఆలోచనలకు కొంత హాని జరిగింది.

ఆ బృహత్తర ప్రణాళిక అయిదు సంవత్సరాల వెనుకబడటమే కాదు, అక్కడ ఎన్నో రకాల విషబీజాలు నాటబడ్డాయి. వాటన్నిటినీ అధిగమించి మళ్ళీ ఎంతో వైభవంతో కూడుకున్న రాజధాని అమరావతి విలసిల్లాలంటే మళ్ళీ ఆ ఆలోచనలు **అంబుల పొది**ని బయటకు తీయాల్సిందేగా? అది ఏ ఒక పార్టీ, కులం, ప్రాంతానికో సంబంధించినది కాదు, కాకూడదు. అదొక జాతి, భాష, సంస్కృతికి సంబంధించిన విషయం. అమరావతి, ప్రపంచంలోనే ఒక వింతగా వెలగాలంటే. స్థానిక మహిళల, రైతుల కృషి, త్యాగాలు ఏ మాత్రం వృథా కాగూడదు.

భవిష్యత్ దృష్టికి మూలాలు

చంద్రబాబు ఒక విధంగా బాటసారే. ఆయన గొప్పతనంగా ఎక్కువగా గుర్తు చేసుకునేది విజన్–2020 గురించే.

క్లిష్ట పరిస్థితి నుంచే అవకాశాలు అనే విషయంలో చాలామందికి తెలిసిందే. రాజకీయ నాయకులు క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొంటారు అనే కదా వాళ్ళ భవిష్యత్. మరి ఇందిరాగాంధి 1974–75 లో రాజకీయ వ్యతిరేక పవనాలను, పరిస్థితిని (జార్జిఫెర్నాండెజ్ రైలు సమ్మె, ఆ వెంటనే జయప్రకాష్ నారాయణ ఉద్యమం–**నవనిర్మాణ్** తో మొదలై) అధికారాన్ని ఉపయోగించి, స్వల్పకాలిక Short term దృక్పథంతో National emergency

జాతీయ అత్యవసర పరిస్థితి ద్వారా అధిగమించడానికి ప్రయత్నించింది. దాదాపు 20 సంవత్సరాల తర్వాత ఇంకో క్లిష్టపరిస్థితిని ఆర్థిక క్లిష్టపరిస్థితిగా

పరిగణించి, ఆ దృష్టికోణంలో 1991 Economic reforms ఆర్థిక సంస్కరణలు చేపట్టడం జరిగింది. అదొక మైలురాయిగా నిలిచిపోయింది.

మరి చంద్రబాబు 1994-95 ఉమ్మడి రాష్ట్ర చీఫ్ మినిస్టర్ అయినపుడు రాష్ట్రంలో వున్న ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితిని ప్రభుత్వం మాత్రమే ఎదుర్కోలేదని గ్రహించి ఇంకో రకంగా అవకాశాన్ని ప్రయత్నించాడు. విస్తృత ఆలోచనల ద్వారా చంద్రబాబుకి రెండుసార్లు అలాంటి అవకాశాలు వచ్చాయి. ప్రభుత్వం సమస్యని సమర్థంగా చేయలేదని భావించి ప్రజానీకాన్ని మేల్కొలపాలని మూడు విషయాలపై దృష్టి నిలిపాడు. అదే చంద్రబాబు ప్రత్యేకత.

చంద్రబాబు ఒక్క ఆర్థిక కోణం నుంచే కాక, రాష్ట్రంలోని మూడు, నాల్గు ప్రత్యేక నిగూఢ సమస్యల మీద దృష్టి పెట్టాడు. అయితే ఇవి వెంటనే సరైన రీతిలో ప్రజలకి చెప్పలేకపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏ కార్యక్రమాలు చేపట్టినా కూడా ఈ మూడు సమస్యలూ ముందుకాళ్ళకు బంధాలుగా ప్రత్యక్షమయ్యాయి. వాటి వెనుక సంకుచిత రాజకీయయోధులు అప్పుడూ, ఇప్పుడే కాదు, ఎప్పుడూ వుంటారు.. వాటిని ఏ పార్టీ నాయకుడూ ఎదుర్కొనలేదు. ఆ ధైర్యం లేకనా? ఆలోచన లేకనా? అవే:

1. ఆర్థిక, సాంఘిక అసమానతలు

2. కులాల కుంపట్లలో కూరుకుపోయిన సంకుచిత భావాల ప్రాంతీయ నాయకులు.

3. తాత్కాలిక రాజకీయాలతో సంతృప్తి చెంది, మునిగి తేలటం, సతమతం అవుతున్న ప్రజలని కూడా అందులో నిమగ్నం చేయటం, వీటికి తోడు ప్రభుత్వ వ్యవస్థల తీరు, నత్తనడక అలవాట్లు సరే సరి. వీటన్నిటిని కలిపి ఎదుర్కొనలేమా?

ఈ మూడు, నాల్గు మూల సమస్యలని అధిగమించాలంటే ప్రజల దృష్టి భవిష్యత్ పై పెట్టాలి. ఆ ఆలోచనలో ముంచెత్తాలి. అదే అప్పటి విజన్ - 2020 కార్యక్రమం. దాన్ని విస్తృతంగా సమాజంలోకి తీసుకు పోవాలి. కాని చంద్రబాబు ఈ విషయాలను సమగ్రంగా ప్రజల్లోకి తీసుకెళ్ళ లేకపోయారు.

అప్పుడు పార్టీలో, ప్రభుత్వంలో వీటిని కనీసం అర్థం చేసుకున్నవారు ఎవరూ లేకపోవటం జటిలసమస్య. తన ముందే వున్నా చంద్రబాబు వెంటనే గ్రహించనిది.

ఒక ఇండిపెండెంట్ పరిశోధకునిగా నాకు ఆ మూడుసార్లూ, (1974-77 లో, 1991-95 లో 1993-97 లో కూడా) దేశంలో, రాష్ట్రంలో సన్నిహితంగా, చురుకుగా విశ్లేషించే అవకాశం కల్గింది.

ప్రాంతీయ వ్యత్యాసాలే కాదు, కులమత ద్వేషాలతో రాష్ట్రం అల్లకల్లోలం అవుతుంది. ఎవరికి వారేగా రాజకీయ నాయకులు ఎప్పటికప్పుడు కాలం ఎట్లాగో గడిపేస్తూ, మసిపూసిన మారేడుకాయలుగా మారుస్తున్నారు. ఆధిపత్యంకోసం తంటాలు పడటంతో సరిపోతుంది. అటువంటి రాజకీయ పరిస్థితుల్లో ఏ నాయకుడికైనా అభివృద్ధిలో మార్పులు చూపించడం కష్టం. ఈ విషయం చంద్రబాబు గ్రహించాడు. భవిష్యత్ గురించి ప్రజలు ఆలోచించి, దానిపై ధ్యాస పెడితే బాగుంటుందనుకున్నాడు. పి.వి.నరసింహరావు, మన్మోహన్ గార్ల దృష్టి ఆర్థిక విధానాల మార్పులకే ఒక విధంగా పరిమితమైతే, చంద్రబాబు దృష్టి ప్రజల మనోభావాలు, ఆలోచనలు, పద్ధతుల మార్పుకోసం కృషి చేయటం పై కేంద్రీకరించాడు. అందుకే విజన్-2020 మీద అంత హడావుడిగా, నిశితంగా దృష్టిపెట్టాడు. నన్ను రాత్రికి రాత్రి ఢిల్లీ నుంచి రప్పించాడు. అంతకు ముందు రాష్ట్రంలో, పదవిలో వుండగా, ఏ నాయకుడూ, అంత విస్తృతంగా, లోతుగా ఆలోచించలేదు.

I.T. Information Technology తోడ్పాటు



(సమాచార సాంకేతికత **పరస్పర భావవ్యక్తీకరణకు**, **సమాచార(డేటాని) బదిలీ** చేయడానికి, **సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి** సాంకేతిక పరిజ్ఞానం. ఇందులో విశ్లేషకాలు, యాంత్రికీకరణ, కృత్రిమ మేధస్సు వంటివి భాగాలు.)

చంద్రబాబా! మజాకా!! అన్న రీతిలో మొదటి 20 సంవత్సరాల రాజకీయ జీవితంలోనే Information technology వీరుడుగా కూడా పేరు తెచ్చుకున్నాడు. ఏ రాష్ట్ర రాజకీయ నాయకుడు కానంతగా. 1990-2010 లో దేశాన్ని టెక్నాలజీ వైపు ఒక మలుపు తిప్పిన సంవత్సరాలలో ముఖ్యంగా సాఫ్ట్ వేర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఉపయోగంలో వాటి పాలసీల విషయంలో ఎన్నో నిర్ణయాలు తీసుకున్నాడు. ఆ పురోగతిని గ్రహించి, వాటిని వినియోగించుకుని ఏ పాలసీలు అవసరమో ఆలోచించటం చంద్రబాబు విశిష్టత, ఆయన ప్రత్యేకత. అలా ఆయన IT రంగం అభివృద్ధి చేసి, వేలమంది యువతీయువకులకు, మార్గదర్శకుడయ్యారు. యువతరానికి కొత్త జీవన విధానానికి మార్గం సుగమం చేశారు.



కాల్ సెంటర్, నెట్వర్క్, కేబుల్ కనెక్టివిటీ వీటన్నిటి ఆవశ్యకత, ఉపయోగాల గురించి లోతుగా అధ్యయనం చేశాడు. నూతన ఉద్యోగఅవకాశాల ఆలోచన ఆంధ్రప్రదేశ్లో రావడానికి చంద్రబాబు మూలాలు వెదికాడు. అవకాశాలను స్వయంగా తెల్సుకుని రంగం సిద్ధం చేశాడు.

నేను అంతకు ముందెప్పుడో కంప్యూటర్ డేటాబేస్ లు ఏ విధంగా ఉపయోగపడతాయో! ఆయన పార్టీ కార్యక్రమాలు చేపట్టినప్పుడు తెలియజేస్తే 1984 లో Dr.T.H. Chowdary) (డాక్టర్ హనుమాన్ చౌదరి) చంద్రబాబుకు ఉవ్వెత్తున లేస్తున్న IT, Software రంగాల్లో మార్పులు, అవకాశాల గురించి తన IT vision(సుదూరదృష్టి) ద్వారా తెలియజేశారు. సత్యం రాజుగారి పాత్ర కూడా ఈ విషయంలో వుంది. చంద్రబాబుని Prime Minister Na tional Task Force on IT and software, co-chairman గా చొరవ తీసుకున్నారు. అప్పుడు వాజపాయ్

నాయకత్వ (1998) ప్రభుత్వం, చంద్రబాబు ప్రతిపక్ష పార్టీల కన్వీనర్. అయినా బాబును నియమించి ఒక అద్భుత అవకాశాన్ని కలగజేశారు. చంద్రబాబుకి 2000లో వచ్చిన సాఫ్ట్ వేర్ సంక్షోభంలో హైదరాబాద్ పాత్ర అమోఘం. అది చంద్రబాబు చొరవే. ఆయనతోపాటు ఇంకా ఎంతోమంది యోధులని ముందుకు తీసుకువచ్చారు.



మనోరమ, అర్జునరావు దంపతులను సత్కరిస్తున్న చంద్రబాబు




స్వాతంత్ర్య సమరయోధుడిని సత్కరిస్తున్న చంద్రబాబు, పక్కన మండలి బుద్ధప్రసాద్ తదితరులు



రచయిత గురించి

డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు గారిది కృష్ణాజిల్లా, ముదునూరు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. అదే స్ఫూర్తితో, ఆదర్శాలతో తీర్చిదిద్దుకుని అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదివి, ఇండియాకి తిరిగి వచ్చి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణే కాకుండా వాటిని తీర్చిదిద్దటంలో దేశంలో గణనీయమైన పాత్ర వహించారు. 60 సంవత్సరాలుగా న్యూ ఢిల్లీలో వుండి ఎన్నో ప్రభుత్వాలకు ఎన్నో రకాలుగా సహాయాలని అందిస్తూ ఎన్నో కొత్త ఆలోచనలకి నాంది పలికి, నాయకులకు దిక్సూచిగా కూడా పేరొందారు. ఎన్నో స్వయం సహాయక సంస్థలు ఏర్పాటు చేసి గ్రామంలో వుంటూ, ప్రస్తుతం **జీవిత చరిత్రల గ్రంథాలయం** పెట్టి పిల్లల చేత చదివించే పనిలో వున్నారు. ఇంగ్లీషులో దేశాన్ని గురించి 20, తెలుగులో గ్రామాల గురించి మూడు పుస్తకాలు వ్రాశారు. ఇది నాలుగోది. 1966లో ఆయన వ్రాసిన "Politics of Leadership in an Indian State" ఇంగ్లీషు పుస్తకం దేశంలోనే ఆ కోవలో మొదటిది. మరో గ్రంథాన్ని ఇప్పుడు నేషనల్ బుక్ ట్రస్ట్ హిందీలో ప్రచురిస్తుంది.



Next Big Game Changer of Elections in India

by Dr N Bhaskara Rao | 13 October 2021

★★★★★ 1


Kindle Edition

₹0 kindleunlimited

Free with Kindle Unlimited membership Learn More

Available instantly

Or ₹225 to buy



A Handbook of Poll Surveys in Media: An Indian Perspective

by Rao Bhaskara N | 1 January 2010

★★★★★ 1


Hardcover

₹388 M.R.P: ~~₹550~~ (29% off)

Delivery **7 - 9 Mar**

More Buying Choices

₹295 (6 used & new offers)



The Third Eye of Governance

by Dr N. Bhaskara Rao | 1 January 2021

★★★★☆ 3

Paperback

₹430.69

prime

FREE delivery **Tue, 27 Feb** on ₹499 of items fulfilled by Amazon

Or fastest delivery **Tomorrow, 26 Feb**

Only 1 left in stock.


More Buying Choices

₹406.25 (4 new offers)

Kindle Edition

₹409.16 (22% off)

Available instantly



The TRP Trick-How Television in India was Hij

by N Bhaskara Rao | 1 January 2019

★★★★★ 1

Hardcover

₹420 M.R.P: ~~₹695~~ (40% off)

Delivery **Sun, 3 Mar**

Kindle Edition

₹376


Available instantly



Chronicles of a village boy in New Delhi
by N Bhaskara Rao | 18 October 2015
★★★★★ 5
Kindle Edition
₹230^{10}
Available instantly




Sushasan
Hindi Edition | by N. Bhaskara Rao | 1 July 2016
★★★★½ 3
Paperback
₹325
Delivery **Sun, 3 Mar**
Only 2 left in stock.



The Green Puzzle: Missing Links in India's Crusade to Sustain Environment
by Dr N. Bhaskara Rao | 11 December 2021
Kindle Edition
₹0 kindleunlimited
Free with Kindle Unlimited membership Learn More
Available instantly
Or ₹175 to buy

Paperback
₹495
FREE delivery **Sat, 2 Mar**
Only 1 left in stock.



Rejuvenating The Republic
by Dr N Bhaskara Rao | 1 October 2021
★★★★★ 1
Kindle Edition
₹0 kindleunlimited
Free with Kindle Unlimited membership Learn More
Available instantly
Or ₹225 to buy

Paperback
₹300
Delivery **Sun, 3 Mar**
Only 1 left in stock.



Citizen Activism in India: Civil Society's Hotspots - 2018
by Dr N Bhaskara Rao | 5 October 2018
★★★☆☆ ˅ 2
Kindle Edition
₹0 kindleunlimited
Free with Kindle Unlimited membership Learn More
Available instantly
Or ₹195 to buy




Unleashing Power of News Channels
Telugu Edition | by Dr. N Bhaskara Rao and Dr. D Chandrasekhara Reddy | 1 January 201
Paperback
₹120
✓prime
FREE delivery **Fri, 1 Mar** on ₹499 of items fulfilled by Amazon
Only 1 left in stock.
More Buying Choices
₹112 (3 new offers)



The Emperor's Mirror: The State of Independent Research in India
by Dr. N.Bhaskara Rao | 5 March 2024
Paperback
₹449 M.R.P: ~~₹499~~ (10% off)
FREE delivery on orders over ₹499 shipped by Amazon
This title will be released around March 5, 2024.



Good Governance: Delivering Corruption-free Public Services
by N Bhaskara Rao | 4 February 2013
★★★☆☆ ˅ 1
Hardcover
₹536 M.R.P: ~~₹1,284~~ (58% off)
FREE delivery **Mon, 4 Mar**




Sustainable Good Governance, Development and Democ
by N Bhaskara Rao | 15 December 2018
Hardcover
₹919 M.R.P: ~~₹1,095~~ (16% off)
✓prime
FREE delivery **Fri, 1 Mar**
Only 1 left in stock.
More Buying Choices
₹760 (10 new offers)




Reposition to unleash the power of news channels
by N. Bhaskara Rao | 1 September 2017
★★★★★ ˅ 1
Paperback
₹450 M.R.P: ~~₹495~~ (9% off)
FREE delivery Sun, 3 Mar
Only 2 left in stock.
More Buying Choices
₹325 (4 new offers)



Social Effects of Mass Media in India
by N. Bhaskara Rao and G.N.S. Raghavan | 1 December 1996
Hardcover
₹569 M.R.P: ~~₹780~~ (27% off)
Delivery 7 - 9 Mar
More Buying Choices
₹534 (8 new offers)



The Nehru Legacy: An Appraisal
by Amal Ray, N. Bhaskara Rao, et al. | 1 May 1992
Hardcover
Currently unavailable.



"Pillalu pidugulu sisindrelena...?'' Gramallo pillalu Bhavipourulu avvaliga by N. Bhaskar Rao